


ఆంధ్రజ్యోతి



నిజామాబాద్
జిల్లా వార్తలు

నుడా విస్తరణ!





- జిల్లాలోని మూడు మున్సిపాలిటీల పరిధిలో రాష్ట్ర ప్రభుత్వం 380 గ్రామాలను కలుపుతూ నిర్ణయం
- పాత గ్రామాలను కలుపుకొని పెరిగిన నుడా
- భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకొని విస్తరణ
- కార్యాలయాన్ని కూడా విస్తరించనున్న ప్రభుత్వం

నిజామాబాద్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): నిజామాబాద్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (నుడా)ను ప్రభుత్వం విస్తరించింది. జిల్లాలో మూడు మున్సిపాలిటీలను, గ్రామాలను కలుపుతూ నిర్ణయం తీసుకుంది. జిల్లావ్యాప్తంగా అభివృద్ధి, మౌలిక వసతుల కల్పనను చేసేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ఉత్తర్వులను కూడా జారీ చేసింది. నుడా పరిధిలో గ్రామాలను కలపడంతో పాటు భవిష్యత్తులో చేపట్టే పలు రకాల కార్యక్రమాలను నుడా పరిధిలో చేయనున్నారు. కేంద్ర ప్రభుత్వం పట్టణీకరణకు ఎక్కువగా నిధులను కేటాయిస్తుండటంతో నుడా పరిధిలో కార్పొరేషన్‌తో పాటు మూడు మున్సిపాలిటీలు, పరిసర గ్రామాలను కలిపి నిర్ణయం తీసుకున్నారు. నుడా పరిధిలో పలు నిర్ణయాలను తీసుకోవడంతోపాటు కార్యాలయ విస్తరణకు కూడా ఏర్పాట్లను చేయనున్నారు. ఇప్పటివరకు కార్పొరేషన్ పరిధిలోని శివారుగ్రామాలకే పరిమితమైన నుడా జిల్లా వ్యాప్తంగా మెజార్టీ గ్రామాల పరిధిలో కార్యక్రమాలను చేపట్టనుంది.

వసతులను కల్పించేలా..

నిజామాబాద్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీని విస్తరిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటూ రాష్ట్ర మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి దాన కిశోర్ ఉత్తర్వులను జారీ చేశారు. భవిష్యత్తులో చేపట్టే అభివృద్ధి, ప్రణాళికలకు అనుగుణంగా గ్రామాలు కూడా అభివృద్ధి చెందేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు విడుదల చేసిన జీవోనెంబర్ 189లో పేర్కొన్నారు. నిజామాబాద్ పరిధిలోని బోధన్, ఆర్మూర్, భీంగల్ మున్సిపాలిటీ పరిధిలోని 380 గ్రామాలను నుడా పరిధిలో కలుపుతున్నట్లు ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. పెరుగుతున్న జనభా, పట్టణీకరణలో భాగంగా నుడాను విస్తరించడంతోపాటు సాటిలైట్ పట్టణాలను ఏర్పాటు చేసే విధంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఉత్తర్వులో తెలిపారు. నుడాపరిధిలోని గ్రామాలకు రోడ్లు, నీటిసరఫరా, ఉపాధితోపాటు ఇతర వసతులను కల్పించేలా ఈ నుడాను విస్తరించినట్లు పేర్కొన్నారు.

నుడా పరిధిలోకి 88 గ్రామాలు..

నిజామాబాద్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ పరిధిలో ప్రస్తుతం 88 గ్రామాలు ఉన్నాయి. జిల్లా కేంద్రం చుట్టూ విస్తరించి ఉన్న గ్రామాలను నుడా పరిధిలో కలిపారు. కార్పొరేషన్ పరిధి నుంచి మూడు నియోజకవర్గాల పరిధిలోని గ్రామాలను ఈ నుడాలో కలిపి ఏర్పాటుచేశారు. ఇప్పటివరకు ఈ గ్రామాల పరిధిలోని నుడా కార్యక్రమాలను చేపడుతున్నారు. నిజామాబాద్ నగరం చుట్టూ 20 కిలోమీటర్ల విస్తీర్ణంలో ఈ నుడా గ్రామాలు ఉన్నాయి. నుడా నుంచి ప్రత్యేక కార్యక్రమాలు ఈ గ్రామాల పరిధిలో చేపడుతున్నారు. నిధులను వెచ్చించి మౌలిక వసతులను కల్పిస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాల పరిధిలో ఆయా పట్టణాభివృద్ధి సంస్థల పరిధిలోకి మున్సిపాలిటీ శివారు గ్రామాలను తీసుకవచ్చి ఉత్తర్వులను జారీ చేశారు. అదే రీతిలో నిజామాబాద్ జిల్లా పరిధిలోని ఈ గ్రామాలను తీసుకువచ్చారు. కొత్తగా నుడాను విస్తరించి అన్ని మండలాల పరిధి నుంచి గ్రామాలను వీటిలో కలిపారు. మూడు మున్సిపాలిటీల పరిధిలో 380 గ్రామాలను ఈ నుడా పరిధిలోకి తీసుకువచ్చారు. పాత 88 గ్రామాలను కలుపుకుంటే మొత్తం 468 గ్రామాలను ప్రస్తుతం నుడా పరిధిలోకి వస్తున్నాయి. ఇప్పటి నుంచి ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం ఈ గ్రామాల పరిధిలో కూడా అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టనున్నారు.

గ్రామాల్లో అభివృద్ధి పనులు

కొత్తగా నుడాను విస్తరించడం వల్ల ఆయా గ్రామాల పరిధిలో అభివృద్ధి పనులను కొనసాగించనున్నారు. గ్రామ పంచాయతీలు యధావిధిగా కొనసాగుతాయి. మున్సిపాలిటీలో కార్యక్రమాలు జరుగుతాయి. పట్టణీకరణకు సంబంధించిన కార్యక్రమాలే నుడానుంచి నిర్వహిస్తారు. ప్రధానంగా మౌలిక వసతులపై దృష్టిపెట్టి కొనసాగిస్తారు. జిల్లాలో మొత్తం 545 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వీటి పరిధిలో ప్రస్తుతం 468 గ్రామ పంచాయతీలను నుడాపరిధిలోకి తీసుకువచ్చారు. యధావిధిగా గ్రామ పంచాయతీలో పాలకవర్గాల ఆధ్వర్యంలోనే కార్యక్రమాలను నిర్వహిస్తారు. ఈ గ్రామాల పరిధిలో జరిగే రియల్‌ఎస్టేట్, పారిశ్రామిక సంస్థల ఏర్పాటు, భారీ రోడ్‌లు, ఇతర మౌలిక వసతుల కల్పన మాత్రం నుడా పరిధి నుంచి చేపడుతారు. కేంద్ర ప్రభుత్వం అన్ని రాష్ట్రాల్లోని పట్టణాభివృద్ధి సంస్థలకే నిధులను విడుదల చేస్తుంది. మున్సిపాలిటీలకు తక్కువ మొత్తంలో నిధులను ఇస్తుంది. పట్టణీకరణలో భాగంగా మౌలిక వసతులకు కేంద్రం ఎక్కువగా నిధులు ఇస్తుండటం, గ్రామీణ ప్రాంతాల్లో గ్రామ పంచాయతీలను అభివృద్ధి చేయడం, జనాభా ఎక్కువగా ఉన్న వాటిని మున్సిపాలిటీగా ఏర్పాటు చేయడం, కావాల్సిన వసతులను కల్పించేందుకు నుడాను విస్తరించినట్లు అధికారుల సమాచారం బట్టి తెలుస్తుంది. మున్సిపాలిటీలతో ధీటుగా అభివృద్ధిని కల్పించడంతో పాటు రోడ్లు, తాగునీటి వసతి, ఉపాధి కల్పన కోసం పరిశ్రమల ఏర్పాటు వంటివి గ్రామీణ ప్రాంతంలో చేసేందుకు నుడా ఆధ్వర్యంలో నిర్ణయం (మిగతా 8వ పేజీలో..)


వీసీలో మాట్లాడుతున్న అధికారి


పాల్గొన్న కలెక్టర్

అంతర్రాష్ట్ర తనిఖీ కేంద్రాల వద్ద
గట్టి నిఘా

- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

నిజామాబాద్ అర్బన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అంతర్రాష్ట్ర సరిహద్దు ప్రాంతాల చెక్‌పోస్టులవద్ద గట్టి నిఘా కొనసాగిస్తున్నామని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు తెలిపారు. సరిహద్దు ప్రాంతాల చెక్‌పోస్టుల స్థితిగతులపై రాష్ట్ర రవాణా శాఖ కమిషనర్ ఇలంబర్తి శనివారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత కలెక్టర్లు, రవాణా శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద కట్టుదిట్టమైన నిఘా కొనసాగేలా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని కమిషనర్ సూచించారు. ఉమ్మడి తనిఖీ కేంద్రాల వద్ద ఇంకా ఏమైనా సదుపాయాలు అవసరం ఉన్నట్లయితే ప్రతిపాదనలు పంపాలని సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు మాట్లాడుతూ పొరుగున గల మహారాష్ట్రకు ఆనుకొని ఉన్న జిల్లాలోని సాలూరా, కందకుర్తి, పోతంగల్, ఖండ్‌గాం ప్రాంతాలలో ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్టులు కొనసాగుతున్నాయని తెలిపారు. రవాణా, అటవీ, ఎక్సైజ్, పోలీసు, రెవెన్యూ, వాణిజ్య పన్నుల శాఖలు ఉమ్మడి చెక్‌పోస్టుల వద్ద సంయుక్తంగా తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రతీ చెక్‌పోస్టుల వద్ద రెండు చొప్పున సీసీ కెమెరాలు ఏర్పాటుచేసి అక్రమ రవాణాకు ఆస్కారం లేకుండా అనునిత్యం పకడ్బందీ పర్యవేక్షణ జరిపిస్తున్నామని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో రవాణా శాఖ అధికారులు పాల్గొన్నారు.

చెకుముకి సైన్స్ సంబరాల పోస్టర్ల ఆవిష్కరణ

నిజామాబాద్ అర్బన్, అక్టోబరు26 (ఆంధ్రజ్యోతి): జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించే చెకుముకి సైన్స్ సంబరాలు-2024 పోస్టర్‌ను కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు శనివారం తన ఛాంబర్‌లో ఆవిష్కరించారు. బాల బాలికల విద్య, విజ్ఞానం, వికాసం కొరకు నవంబర్ 7న పాఠశాలస్థాయి, నవంబర్ 21న మండల స్థాయి, నవంబర్ 28న జిల్లా స్థాయిలో సైన్స్ టెస్టులు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు డిసెంబర్ 14, 15, 16 తేదీల్లో ఆదిలాబాద్ జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ పులి జైపాల్, గౌరవ అధ్యక్షుడు బాస రాజేశ్వర్, శ్రీహరి ఆచార్య, నారాయణ, పండరి, శంకర్, కృష్ణ పాల్గొన్నారు.


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

బోధన్‌లో ఆగిన గూడ్స్ రైలు

- సాంకేతిక లోపంతో ముందుకు కదలని రైలు
- రైల్వే గేటుకు ఇరువైపులా భారీ వాహనాలతో ట్రాఫిక్ జామ్



6

ప్రమిదలకు పెరిగిన గిరాకీ

- నగరంలో ప్రమిదల దుకాణాల వద్ద కొనుగోళ్ల సందడి
- ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి విక్రయిస్తున్న వ్యాపారులు



7

మున్సిపల్‌ను ఆనుకొని కాంప్లెక్స్

- అనుమతి ఇంటికి.. నిర్మిస్తున్నది కమర్షియల్ కాంప్లెక్స్
- విషయం తెలిసినా పట్టించుకోని ఆర్మూర్ మున్సిపల్ అధికారులు



6



ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు, కార్మికులు


మాట్లాడుతున్న జ్యోతి

సమస్యల పరిష్కారమే లక్ష్యంగా
పోరాటాలను కొనసాగిస్తాం

- ప్రజాసమస్యలను పట్టించుకోవడంలో బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు విఫలం
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు జ్యోతి

సుభాష్‌నగర్, అక్టోబరు26 (ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పేదప్రజల కోసం ప్రజాపోరాటాలను కొనసాగిస్తామని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు టి.జ్యోతి అన్నారు. నిజామాబాద్‌లోని రాజీవ్‌గాంధీ ఆడిటోరియంలో శనివారం జరిగిన సీపీఐ(ఎం) జిల్లా మహాసభలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. దేశానికి మతోన్మాద ప్రమాదం పొంచిఉందని ప్రజాసమస్యలను బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు పట్టించుకోవడం లేదని ఆమె ఆరోపించారు. ఒక పార్టీపై మరొక పార్టీ ఆరోపణలు చేసుకుంటూ ప్రజాసమస్యలను పట్టించుకోవడం లేదని ఆమె విమర్శించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఏపనిని కూడా సక్రమంగా చేయడం లేదన్నారు. దేశవ్యాప్తంగా ఐక్యతను విచ్ఛిన్నం చేస్తూ కులమత భేదాలను రెచ్చగొడుతూ శాంతిభద్రతలకు భంగం కలిగిస్తున్నారని అన్నారు. నేటికీ దేశంలో మహిళలకు రక్షణ లేదని వారిని ఇప్పటికీ రెండో తరగతి వ్యక్తులు గానే చూస్తున్నారని అన్నారు. కేంద్ర ప్రభుత్వం బడా కంపెనీలకు అండగా ఉంటుందని అదానికి, అంబానికి వత్తాసు పలుకుతుందని ఆమె ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత మేనిఫెస్టోలో పేర్కొన్న ఏఒక్క అంశాన్ని ఇప్పటివరకు అమలు చేయలేదన్నారు. బస్సుల్లో ఉచిత ప్రయాణం ఒక్కటే అమలు చేస్తున్నా తగినన్ని బస్సులను వేయడం లేదన్నారు. వ్యవసాయ కార్మికులకు 12వేల రూపాయలు కూలీబంధు ఇవ్వాలని, రైతులకు గిట్టుబాటు కల్పించాలని డిమాండ్ చేశారు. సీపీఐ(ఎం) పార్టీ అన్ని వర్గాల సంక్షేమం కోసమే పని చేస్తోందని అన్నారు. భవిష్యత్తు కార్యకలాపాలను ముందే నిర్ణయించుకొని ముందుకు పోతుందని ఆమె అన్నారు. రాగాల మూడేళ్లలో లక్ష్యాలను నిర్ణయించుకొని పేదల సమస్యలపై పోరాటం చేసేందుకు పార్టీ నిర్ణయించిందని సీపీఐ(ఎం) జిల్లా ఇన్‌చార్జి రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పాలడుగు భాస్కర్ అన్నారు. జిల్లాలో పరిశ్రమలు తక్కువగా ఉన్నాయని అన్నారు. పరిశ్రమలు పెడితే జిల్లాలోని నిరుద్యోగులకు ఉపాధి దొరుకుతుందన్నారు. ఉన్న పరిశ్రమలను మూతవేసిన ప్రభుత్వాలు తెరిపించేందుకు చర్యలు తీసుకోవడం లేదని ఆయన ఆరోపించారు. నిజాం షుగర్ ఫ్యాక్టరీ, నిజామాబాద్ కోఆపరేటివ్ షుగర్ ఫ్యాక్టరీని కూడా తెరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. పసుపు బోర్డు ఏర్పాటు కోసం కేంద్రం ప్రకటించిన ఇప్పటి వరకు మాత్రం ఎలాంటి చర్యలు చేపట్టలేదన్నారు. ఎంపీ అర్వింద్ పసుపు బోర్డు ఏర్పాటుపై ప్రస్తుతం మాట్లాడటం లేదని ఆయన విమర్శించారు. ఈ మహాసభలోనే పార్టీ నిర్ణయం తీసుకొని సమస్యలపై పోరాటం చేపడుతుందన్నారు. జిల్లా కార్యదర్శి రమేష్‌బాబు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర కమిటీ సభ్యురాలు ఎస్.రమా, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పెద్దివెంకట్రాములు, నూర్జహాన్, వెంకటేశ్, శంకర్‌గౌడ్, జిల్లా కమిటీ సభ్యులు సుజాత, కొండ గంగాధర్, గందం గంగాధర్‌తో పాటు ఇతర నేతలు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ చౌరస్తా నుంచి ర్యాలీ..

సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సమావేశాల సందర్భంగా పార్టీ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ చౌరస్తా నుంచి రైల్వేస్టేషన్ మీదుగా రాజీవ్‌గాంధీ ఆడిటోరియం వరకు పార్టీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. పార్టీ నేతలతో పాటు కార్యకర్తలు ఈ ర్యాలీలో పాల్గొన్నారు. రాజీవ్‌గాంధీ ఆడిటోరియం వద్ద పార్టీ జెండాను ఆవిష్కరించడంతో పాటు సీపీఐ(ఎం) జాతీయ ప్రధాన కార్యదర్శి చేసిన సీతారాం ఏచూరి చిత్రపటానికి నివాళులర్పించారు.



పోలీసు శాఖలో పెరిగిపోతున్న
పెండింగ్ బిల్లులు!

- మంజూరు కాక ఇబ్బందిలో సిబ్బంది
- జిల్లాలో రూ. 30కోట్లకు పైగా పెండింగ్ బకాయిలు
- ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకోలు

ఖిల్లా, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): పోలీసు శాఖలో పెండింగ్ బిల్లులు పెరిగిపోతున్నాయి. పేరుకున్న బిల్లులతో సిబ్బంది పరేషాన్ అవుతున్నారు. కిందిస్థాయి సిబ్బంది నుంచి ఉన్నతస్థాయి అధికారుల వరకు బిల్లులు మంజూరు కాక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. జిల్లాలో పనిచేస్తున్న వివిధ రకాల సుమారు రూ.30కోట్లకు బిల్లులు పెండింగ్‌లో ఉన్నట్లుసిబ్బంది ద్వారా తెలిసింది. ఉన్నతాధికారులు విధి నిర్వహణలో భాగంగా పర్యటనలకు వెళ్లి వాటికి సంబంధించిన బిల్లుల మంజూరుకు ఆ శాఖకు పెట్టుకున్న రోజుల తరబడి ఎదురుచూసిన మంజూరుకు నోచుకోవడం లేదని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెండింగ్‌లో ఉన్న బిల్లుల మంజూరుకాక పేరుకపోతున్న బిల్లుల ప్రభావం శాంతిభద్రతలపై పడే ప్రమాదం కనిపిస్తోంది. బిల్లులు రావడం లేదని ఉన్నతాధికారులు విధినిర్వహణలో భాగంగా పర్యటలకు వెళ్లడం లేదని తెలిసింది. ఉన్నతాధికారుల పర్యటనలు లేకపోవడంతో కిందిస్థాయి సిబ్బందిపై పర్యవేక్షణ లోపించే అవకాశం ఉంది. ఆర్థిక పరిస్థితుల కారణంగా ప్రభుత్వం చెల్లించాల్సిన బిల్లులు పెండింగ్‌లో ఉంటున్న సంగతి తెలిసిందే. పదవీవిరమణ పొందిన తర్వాత ఉద్యోగులకు చెల్లించాల్సిన పీఎఫ్, గ్యాట్యూటీ వంటివి కూడా రోజుల తరబడి ఆగిపోతున్నాయని సిబ్బంది తెలిపారు. మిగతా ప్రభుత్వ ఉద్యోగుల బిల్లుల పరిస్థితి ఒక ఎత్తయితే పోలీసుశాఖది మరోఎత్తు. పోలీసుల పనితీరు మందగిస్తే దాని ప్రభావం సమాజంపై వెంటనే కనిపిస్తుందని సిబ్బంది పేర్కొంటున్నారు. క్షేత్రస్థాయిలో కానిస్టేబుల్ నుంచి ఉన్నతాధికారుల వరకు గొలుసు కట్టలా కలిసికట్టుగా పని చేయాల్సి ఉంటుంది. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా పోలీసులు గస్తీ నిర్వహించాల్సి ఉంటుంది. నేరగాళ్లను పట్టుకునేందుకు వివిధ ప్రాంతాల్లో పర్యటించాల్సి ఉంటుంది. ఇవన్నీ ఖర్చుతో కూడుకున్న విషయాలే. కానీ ఆర్థిక సమస్యల కారణంగా కొంతకాలంగా పోలీసు శాఖకు రావాల్సిన బకాయిలు పెండింగ్‌లో ఉంటున్నాయి. పోలీసుశాఖలో వివిధ విభాగాలకు చెల్లించాల్సిన బిల్లులు సైతం రావడం లేదు. దీంతో చాలా విభాగాల నిర్వహణ బాధ్యతల్లో పాలుపంచుకునే సంస్థలు సేవలందించేందుకు వెనుకాడుతున్నాట్లు తెలిసింది. అధికారులు సొంతశాఖలోని ఇతర విభాగాల నుంచి అప్పు తీసుకుని సర్దుబాటు చేసుకునే పరిస్థితి నెలకొంది. గస్తీ వాహనాలకు పెట్రోల్, డీజిల్‌తోపాటు విడిభాగాల బిల్లులు సైతం నెలల తరబడి పెండింగ్‌లో ఉంటున్నాయి. దీంతో వాహనాలను బయటకు తీయడం సవాలుగా మారింది. ముఖ్యంగా సిబ్బందికి టీఏ, డీఏ, ఎస్ఎల్ఎస్, పీఆర్‌సీ, సిబ్బంది జీపీఎఫ్, టీజీసీఐసీ రుణాలు లాంటివి సకాలంలో చెల్లించలేకపోతున్నారు. కేసులో దర్యాప్తులో భాగంగా నేరగాళ్లను పట్టుకునేందుకు ఆగమేఘాల మీద వెళ్లాల్సి వస్తోంది. ఇటువంటి సమయాల్లో ఎక్కడికక్కడ యూనిట్ అధికారులు రివార్డుల రహస్య నిధుల నుంచి సర్దుబాటు చేసుకుంటున్నట్లు సమాచారం. పోలీసు స్టేషన్ ఖర్చుల కోసం ప్రతీనెలా చెల్లించాల్సిన నిర్వహణ నిధులు కూడా సకాలంలో అందడం లేదని తెలిసింది. స్టేషన్ ఖర్చుల కోసం బాధితులపై ఆధారపడకుండా ఉండేందుకే గత ప్రభుత్వం ఈ నిధులు ఇవ్వడం మొదలు పెట్టింది. ఈ నిధులు ఆగిపోతే బాధితుల వైపు చూసే ప్రమాదం ఉంది.

అవస్థలు పడుతున్నాం..

(షకీల్‌పాషా, పోలీసు సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు)

పోలీసుశాఖ సిబ్బందికి ప్రభుత్వం నుంచి రావాల్సిన పెండింగ్ బిల్లులు రాక అవస్థలు పడుతున్నాం. గత ప్రభుత్వం తప్పిదాల వల్ల వివిధ రకాల బిల్లులు చెల్లింపునకు నోచుకోలేదు. దీంతో సిబ్బంది తీవ్ర ఇబ్బందులకు గురవుతోంది. పెండింగ్‌లో ఉన్న బిల్లులు రాక సకాలంలో శుభకార్యాలు సైతం వాయిదా వేసుకోవాల్సి పరిస్థితి ఉంది. విధుల్లో ఉన్న సిబ్బందికి బైట వడ్డీకి రుణాలు దొరుకుతున్నాయి. కానీ మృతుల కుటుంబాలకు రావాల్సిన గ్రాజువిటీ రాక నానా ఇబ్బంది పడుతున్నారు. కొత్త ప్రభుత్వం స్పందించి తమకు రావలసిన పెండింగ్ బిల్లులను మంజూరు చేస్తుందని ఆశిస్తున్నాం.

పిల్లల చదువుల కోసం అప్పులు

పోలీసుశాఖలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది తమ పిల్లల భవిష్యత్తు కోసం ఉన్నత చదువులు చదివిస్తున్నారు. అయితే వారికి వచ్చే జీతభత్యాలతో వారు తమ పిల్లలను ఉన్నతచదువులు చదివించుకోలేక పోతున్నారు. పీఎఫ్ లాంటి నుంచి డబ్బులు పొందడానికి దరఖాస్తులు చేసుకుంటున్నారు. అవి సకాలంలో రాకపోవడంతో పిల్లల చదువుల కోసం ప్రైవేటు వ్యక్తుల వద్ద నుంచి రుణాలు పొందుతున్నారు. తీసుకున్న అప్పులకు వడ్డీలు చెల్లించలేక నానా అవస్థలు పడుతున్నారు. జిల్లాకేంద్రంలోని ఓ పీఎస్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న సిబ్బంది తన పిల్లలను డాక్టర్లుగా చూడాలని వైద్య కళాశాలలో చేర్పించి తనకు రావాల్సిన జీపీఎఫ్ రుణం కోసం దరఖాస్తు చేసుకున్నాడు. సకాలంలో రుణం మంజూరు కాకపోవడంతో అప్పులుచేసి వడ్డీలు కట్టలేక నానా ఇబ్బంది పడుతున్నాడు. ఇది ఈ ఒక్కడిదే కాకుండా అనేక మంది కిందిస్థాయి సిబ్బంది పరిస్థితి సైతం ఇలాగే ఉన్నట్లు సమాచారం.

భద్రత నిధులు మళ్లింపు..

భద్రత స్కీమ్ నిధులను గత ప్రభుత్వం ఇతర పనులకు మళ్లించినట్లు సిబ్బంది చెప్తోంది. దీంతో సిబ్బందికి అత్యవసర కాలంలో వినియోగంలోకి వచ్చే ఈ నిధి డబ్బులు దుర్వినియోగం పాలవుతున్నాయి. పోలీసు శాఖలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది జీతం నుంచి ప్రతీనెల వేయి నుంచి 3వేల వరకు కోత విధించి భద్రత నిధిలో జమ చేస్తారు. అయితే ఆ నిధి నుంచి కూడా సిబ్బందికి ఉపయోగం కావడం లేదు. సిబ్బందికి ఎటువంటి సాయం అందలేదని వాపోతున్నా రు. ఆ నిధులను సైతం గత ప్రభుత్వం దుర్వినియోగం చేసి ఇతర పనులకు మళ్లించినట్లు ఉద్యోగులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

అంతర్జాతీయ ఉషు పోటీలకు
జిల్లా క్రీడాకారుడు సాయిదీక్షిత్


సాయిదీక్షిత్‌ను సన్మానిస్తున్న సీఐ

సుభాష్‌నగర్,అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ ఉషు పోటీలకు జిల్లాకు చెందిన క్రీడాకారుడు సాయిదీక్షిత్ ఎంపికయ్యాడు. అండర్-12 విభాగంలో ఈ పోటీలకు ఎంపికయ్యారు. ఈ పోటీలు యూరప్ దేశంలోని జార్జియా రాష్ట్రంలో నవంబర్ 12 నుంచి 17 వరకు జరుగనున్నాయి. ఈ పోటీల్లో సాయిదీక్షిత్ తన ప్రతిభను చాటనున్నాడు. అంతర్జాతీయ పోటీలకు ఎంపికైన సాయిదీక్షిత్‌ను నగర సీఐ శ్రీనివాసరాజు అభినందించారు. నగరంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అంతర్జాతీయ పోటీలకు ఎంపిక కావడం పట్ల జిల్లాకు చెందిన క్రీడాభిమానులు, సీనియర్ క్రీడాకారులు హర్షం వ్యక్తం చేశారు.

దక్షిణ ప్రాంత అంతర విశ్వవిద్యాలయం
పోటీల కోసం విద్యార్థి ఎంపిక

ధర్పల్లి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): దక్షిణ ప్రాంత అంతర విశ్వవిద్యాలయం పోటీల కోసం ధర్పల్లి డిగ్రీ కళాశాలకు చెందిన సాయికుమార్ ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ జ్యోతి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎంపీసీఎస్‌కు చెందిన సాయికుమార్ అక్టోబర్ 29 నుంచి నవంబర్ 4 వరకు ఎస్ఆర్ఎం యూనివర్సిటీ చెన్నైలో జరిగే కబడ్డీ టోర్నమెంట్‌కు దక్షిణ ప్రాంత అంతర విశ్వవిద్యాలయం పోటీకి ఎంపికైనట్లు ఆమె పేర్కొన్నారు. తెలంగాణ యూనివర్సిటీ నుంచి సాయికుమార్ ప్రాతినిధ్యం వహిస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా సాయికుమార్‌ను ప్రిన్సిపాల్ జ్యోతి, క్రీడల ఇంచార్జి కుమారస్వామి, వైస్ ప్రిన్సిపాల్ శ్రీరాం, ప్రభాకర్, రవిరాజ్, శ్రీనివాస్‌రెడ్డి అభినందించారు.

రెండు ట్రాన్స్‌ఫార్మర్ల కాపర్ కాయిల్స్ చోరీ

నవీపేట,అక్టోబరు26(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోస్లీ పంచాయతీ పరిధిలోని భరత్ నగర్ తండా, మట్టయ్య ఫారం శివారులలో ఉన్న రెండు ట్రాన్స్‌ఫార్మర్‌ల కాపర్ కాయిల్స్ గురువారం అర్ధరాత్రి గుర్తు తెలియని దొంగలు ఎత్తుకెళ్లారని ఎస్ఐ వినయ్ తెలిపారు. 25కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ల కాపర్ కాయిల్స్‌ను దుండగులు చోరీ చేశారని లైన్‌ఇన్స్‌స్పెక్టర్ రవికుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చెరువులో పడి మహిళ మృతి

ఎడపల్లి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఎడపల్లి మండల కేంద్రానికి చెందిన మహిళ శనివారం ఎడపల్లి గ్రామంలోని పెద్ద చెరువులో పడి మరణించిందని ఎడపల్లి ఎస్సై వంశీ కృష్ణారెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం ఎడపల్లి గ్రామానికి చెందిన అంబటి నాగమణి (56) శుక్రవారం సాయంత్రం కాలకృత్యాలకని ఇంట్లో నుండి వెళ్లి ఎంతకీ తిరిగి రాకపోయే సరికి చుట్టుపక్కల వెతికినా కనిపించలేదని, శనివారం ఉదయం పెద్ద చెరువులో శవంగా కనిపించిందని ప్రమాదవశాత్తు చెరువులో పడి మరణించిందని మృతురాలి కుమారుడు నాగరాజు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

వృద్ధురాలు మృతి..

మాక్లూర్ :మండలంలోని కల్లెడ గ్రామానికి మోతె గంగుబాయి (90) అనే వృద్ధురాలు శుక్రవారం సాయంత్రం గ్రామశివారులోని చెరువులో బహిర్భూమికి వెళ్ళి ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందినట్లు గ్రామస్థులు తెలిపారు. శనివారం విషయం పోలీసులకు మృతురాలి బోజన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎఎస్సైగంగాధర్ తెలిపారు.

రాకాసిపేట్‌లో ఒకరిపై కేసు నమోదు

బోధన్‌రూరల్,అక్టోబరు26(ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణంలో శుక్రవారం రాత్రి రాకాసిపేట్ ఫంక్షన్ హాల్‌లో అనుమతి లేకుండా అక్కడ ఫొటోలు చేయడమే కాకుండా అక్కడికి విధులపై వెళ్లిన పోలీసులపై దురుసుగా ప్రవర్తించడమే కాకుండా అటంకం కలిగించినందుకు సాయికుమార్ అనే వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ వెంకట నారాయణ తెలిపారు.

ఖోఖో క్రీడాకారులకు క్రీడా దుస్తుల వితరణ

సుభాష్‌నగర్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి):రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైన క్రీడాకారులకు క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. నందిపేట మండలం రాజ్‌నగర్ బాయ్స్ యూత్ సభ్యులు బాలబాలికల క్రీడా జట్టుకు క్రీడా దుస్తులను అందజేశారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన క్రీడాకారులు క్రీడా పోటీలలో ప్రతిభకనబర్చి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఖోఖో అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు భూమారెడ్డి, అతీఖ్ ఉల్లాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గీతా కాన్వెంట్ స్కూల్ కరస్పాండెంట్ సాగర్, తదితరులు పాల్గొన్నారు.

29న వాహనాల వేలం

ఆర్మూర్‌రూరల్, అక్టోబరు26(ఆంధ్రజ్యోతి) గత కొన్ని సంవత్సరాలుగా వివిధ కేసుల్లో రవాణా శాఖ అధికారులు సీజ్ చేసిన వాహనాలను ఈనెల 29న వేలం వేయనున్నట్లు ఆర్మూర్ ఎంవీఐ గుర్రం వివేకానందరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలంలో ఆటోలు, మినిగూడ్స్ వాహనాలు, బొలెరోలు, స్కూల్ బస్సులు, మోటర్ సైకిళ్లు, రోడ్డు రోలర్, తదితర వాహనాలు ఉన్నాయన్నారు. సీజ్ చేసిన వాహనాలను ఆర్మూర్ ఆర్టీసీ బస్టాండ్‌లో, నందిపేట, మోర్తాడ్, ముప్కాల్, బాల్కొండ పోలీస్‌స్టేషన్‌లో ఉంచామన్నారు. వాహనాలు ఉన్నది ఉన్నట్టుగా వేలం నిర్వహిస్తామన్నారు. ఆసక్తి గల వారు వాహనాలను పరిశీలించి, దరవతు చెల్లించి వేలంపాటలో పాల్గొనాలని ఎంవీఐ వివేకానంద రెడ్డి అన్నారు. వేలంపాటు 29న ఆర్మూర్‌లోని వాహన తనిఖీ అధికారి కార్యాలయంలో మధ్యాహ్నం 3గంటలకు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

బాధితులకు సెల్‌ఫోన్ల అప్పగింత

ఖిల్లా, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి):వివిధ కారణాలతో పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను గుర్తించిన ఒకటో టౌన్ పోలీసులు బాధితులకు శనివారం అప్పగించారు. వీటి విలువ సుమారు 2లక్షలు ఉంటుందని ఎస్‌హెచ్‌వో రఘుపతి తెలిపారు. పోలీసు శాఖ అమలు చేస్తున్న సీఈఐఆర్ పోర్టల్ ద్వారా వీటిని గుర్తించిన పోలీసులు బాధితులకు అప్పగించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఎస్‌హెచ్‌వో రఘుపతి మాట్లాడుతూ ప్రజలు రద్దీ ప్రాంతాల్లో దుండగుల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.అనుమానం వచ్చినచో వెంటనే డయల్ 100కు కాల్ చేయాలన్నారు. ముఖ్యంగా ఆర్టీసీ బస్‌స్టాండ్, రైల్వే స్టేషన్ల వద్ద ప్రజలు జాగ్రత్తలు పాటించాలన్నారు.

35 చెరువులకు చేపపిల్లల పంపిణీ

ధర్పల్లి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 35 చెరువులకు శనివారం చేపపిల్లలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ మత్స్య అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో వంద శాతం సబ్సిడీతో రూ.5లక్షల 39వేల 535 చేపపిల్లలను మండల అభివృద్ధి అధికారి బాలకృష్ణ, మత్స్యశాఖ అధికారులు గంగపుత్రులకు అందజేసి ఎంపికైన చెరువుల్లో వదిలినట్లు ఆయన చెప్పారు. వీటిని మత్స్యకారుల ఉపాధి కోసం పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆర్మూర్ చిన్నబాల్‌రాజ్, ధర్పల్లి సింగిల్ విండో చైర్మన్ మల్లికార్జున్, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి చెలిమెల నర్సయ్య, బొక్కల బాలయ్య, సురేందర్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు పడకల్ విద్యార్థుల

జక్రాన్‌పల్లి, అక్టోబరు26(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి అండర్-17 వాలీబాల్ పోటీలకు పడకల్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు వ్యాయమ ఉపాధ్యాయుడు శ్రీనివాస్ శనివారం తెలిపారు. పడకల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదోతరగతికి చెందిన శ్వేత, ఇంటర్ మొదటి విద్యార్థి కైలాస్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. పెద్దపల్లి జిల్లా రామ గుండంలో ఈనెల 28వ నుంచి 30వ తేదీ వరకు జరిగే రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలో ఈ విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులు శ్వేత, కైలాస్‌ను ప్రధానోపాధ్యాయుడు సురేంధర్‌రెడ్డి, ఉపాధ్యాయులు, వీడీసీసభ్యులు అభినందించారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

ముప్కాల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ముప్కాల్ మండలకేంద్రానికి చెందిన పంచాయతీ కార్మికుడు భోజన్న మాతృమూర్తి ఇటీవల అనారోగ్యంతో మరణించారు. శనివారం ముప్కాల్‌లోని బాధిత కుటుంబాన్ని బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌కుమార్ పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

మున్సిపల్‌కు ఆనుకొని నిర్మిస్తున్న కాంప్లెక్స్

● ఇంటి అనుమతితో కమర్షియల్ కాంప్లెక్స్ ● ఆర్మూర్‌లో కళ్లు మూసుకున్న మున్సిపల్ అధికారులు



మున్సిపల్ కార్యాలయం పక్కనే నిర్మిస్తున్న కమర్షియల్ కాంప్లెక్స్ ఇదే..

ఆర్మూర్‌టౌన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం పక్కన ఓకమర్షియల్ కాంప్లెక్స్ నిర్మాణం జరుగు తోంది. మున్సిపల్ కార్యాలయంకు అనుకొని కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మి స్తున్న మున్సిపల్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిసున్నారు. గత రెండు నెలల కిందట కమర్షియల్ నిర్మాణం చేపట్టగా ఆ కాంప్లెక్స్‌కు ఇంటి అనుమతి తీసుకొని కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మిస్తున్న మున్సిపల్ అధికారులు అమ్యామ్యాలకు ఆశపడి నిర్మా ణాన్ని పట్టించుకోవడం లేదని పట్టణ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్‌కు పడమర దిశలో నిర్మాణం చేస్తున్నా కాంప్లెక్స్‌ను అధికారులు చూసిచూడనట్లు వ్యవహరించడం ఏంటని పలువురు ప్రశ్నిస్తున్నారు. రాబోవు కాలంలో మున్సిపల్ నూతన భవనం నిర్మాణం చేపడితే మున్సిపల్ అధికారులే సెట్ బ్యాక్ తీసుకొని నిర్మించాలని కాంప్లెక్స్ యజమాని బహిరంగంగానే చర్చించినట్లు తెలిసింది. కళ్లు మూసుకున్న అధికారులు మున్సిపల్ పక్కన నిర్మిస్తున్న కాంప్లెక్స్‌ను పరిశీలించకపోతే పట్టణంలో, విలీనగ్రామాల పరిధిలో జరుగుతున్న అక్రమ కట్టడాలను ఎలా నిలువరిస్తారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఫిర్యాదులు వస్తే తప్ప తూతూ మంత్రంగా జరిమానాలు విధిస్తున్నారు. కానీ చర్యలు చేపట్టకపోవడంతో పలు అనుమానాలకు తావిస్తోంది. ఇప్పటికైనా కళ్లు తెరిచి మున్సిపల్ అధికారులు సరైన రీతిలో పని చేయాలని ప్రజలు కోరుతున్నారు.

నిబంధనలతో నిర్మాణాలు చేపట్టాలి



పట్టణంలో నిర్మిస్తున్న భవంతులకు నిబంధ నలతో నిర్మాణం చేపట్టాలి. పట్టణంలో నిర్మాణం జరిగిన పెద్ద భవంతులకు పార్కింగ్ స్థలం లేకుండా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. ఇప్పటికైనా అధికారులు ఆమ్యామ్యాలకు ఆశ పడి చూసిచూడనట్లు వ్యవహరిస్తే రాబోవు కాలానికి మరిన్ని ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంది. ఇకనైనా మున్సిపల్ అధికారులు నిజాయితీతో నిక్కచ్చిగా వ్యవహ రించాలని ప్రజలు కోరుతున్నారు.

\- ద్యాగ ఉదయ్, మాజీకౌన్సిలర్

కోటగిరిలో బంద్ విజయవంతం


కోటగిరిలో రాస్తారోకో చేస్తున్న దృశ్యం

కోటగిరి,అక్టోబరు26(ఆంధ్రజ్యోతి): హిందు దేవాలయాలపై జరుగుతున్న దాడులకు నిరసనగా హిందు ఐక్యవేదిక ఇచ్చిన బంద్ పిలుపు శనివారం కోటగిరి మండల కేంద్రంలో విజయవంతమైంది. మండల కేంద్రంలో హిందు ఐక్యవేదిక ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. చావిడి నుండి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ కొనసాగింది. అనంతరం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి నిరసన తెలిపారు. కోటగిరి, రుద్రూరు రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా హిందు సంఘాల నాయకులు మాట్లాడుతూ ఆలయాలపై దాడులు, హిందు దేవత మూర్తుల విగ్రహాలను ధ్వంసం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో హిందు సంఘాల నాయకులు నవీన్, శ్రీనివాస్, శ్యామ్, డాన్ రాజ్, హన్మాండ్లు తదితరులు పాల్గొన్నారు.

పుష్కర ఘాట్‌కు అహల్యాబాయి ఓల్‌కార్‌గా నామకరణం


పుష్కర ఘాట్ వద్ద అహల్యాబాయి చిత్రపటం వద్ద నామకరణ చేస్తున్న దృశ్యం

రెంజల్,అక్టోబరు26(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర సామరసత వేదిక ఆధ్వర్యంలో రాణి అహల్యాబాయి ఓల్‌కార్ 300శబాబ్ది ఉత్సవాల సందర్భంగా శనివారం కందకుర్తి పుష్కరఘాట్‌కు అహల్యాబాయి ఓల్‌కార్‌గా నామకరణం చేశారు. 250సంవత్సరాల క్రితం అహల్యాబాయి ఓల్‌కార్ కట్టించిన శివాలయం దగ్గర కందకుర్తి ఘాట్‌కు నామకరణం చేయడం పూర్వజన్మ సుకృతమని తెలంగాణ ప్రాంత కన్వీనర్ అప్పాల ప్రసాద్‌జీ, కార్యదర్శి కొత్త సృజన్ కుమార్ రెడ్డి అన్నారు. ఆదివారం నిర్వహించే ధర్మచార్యుల సమ్మేళనం కార్యక్రమానికి రాష్ట్రంలో ఉన్న సాధుసంతులు వస్తున్నారని దేశంలోని అంటరానితనం, కుల నిర్మూలన కోసం సంకల్పం తీసుకుని ఆశ్రమాల ద్వారా పని చేయాలని నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమానికి హిందువులు అధిక సంఖ్యలో పాల్గొనాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో గజానంద్, విజయ గణపతి, బాల శేఖర్, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీ చేప పిల్లల పంపిణీలో కోతలు విధించొద్దు

● బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి


చేప పిల్లలను వదులుతున్న బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి

ముప్కాల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): చిన్నపాటి వృత్తి చేసుకొని జీవనం సాగిస్తున్న గంగపుత్రులకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీ చేప పిల్లల్లో కోతపెడితే ఊరుకునేది లేదని బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. శనివారం బాల్కొండ మండలంలోని నాగాపూర్ బ్యాక్‌వాటర్ ఎస్సారెస్పీలో ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి చేప పిల్ల లను వదిలారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో కేసీ ఆర్ గంగపుత్రులకు చేపలు, రొయ్యలను బాల్కొండ నియోజక వర్గంలోని 262 చెరువులు, ఎస్ఆర్ఎస్పీ రిజర్వాయర్‌లో వేయానికి గంగపుత్రులకు 72లక్షల చేపపిల్లలు, 69లక్షల రొయ్యపిల్లలు ప్రతి సంవత్సరం పంపిణీ చేశామని ఈ ప్రభుత్వంలో కేవలం 87లక్షల చేపపిల్లలను మాత్రమే పంపిణీ చేస్తుందని అన్నారు. మా ప్రభుత్వ హయంలో పంపిణీ చేసిన చేప పిల్లల కంటే తక్కువ పంపిణీ చేస్తే ఊరుకునేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మం డల అధ్యక్షుడు ప్రవీణ్‌రెడ్డి, ముస్కు భూమే శ్వర్, మండల సీనియర్ నాయకులు సామ వెంకట్‌రెడ్డి, బద్దం నర్సారెడ్డి, బాల్కొండ సొసైటీ చైర్మన్ సురాజ్, మత్స్యశాఖ జిల్లా అధికారి ఆంజనేయులు, తహసీల్దార్ శ్రీధర్, ఏవో లావణ్య పాల్గొన్నారు.

వ్యవసాయగోదాంల పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి

కమ్మర్‌పల్లి: కమ్మర్‌పల్లి, కొనాసమందర్ గ్రామాలలోని సహకార సంఘాల ఎరువుల గోదాంలను బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి శనివారం ప్రారంభించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఈ రెండు గోదాంల నిర్మాణ పనులకు 25లక్షల చొప్పున నిదులు మంజూరికాగా శంకుస్థానలు జరిగాయి. కాని ప్రభుత్వం మారడంతో నిదులు రద్దయ్యాయని ఎమ్మెల్యే మాట్లాడుతు ఎమ్మెల్యేగా తనకు నిధులు లేనిసమయంలో రాజ్యసభ సభ్యులు సంతోష్ కుమార్‌ను కోరగా తన వంతుగా రెండు గోదాంల నిర్మాణాల కోసం 10 లక్షల చొప్పున నిదులు ఇచ్చారని ఈ సందర్భంగా రెండు గ్రామాల సహకారసంఘాల పాలకవర్గసభ్యులు, రైతుల పక్షాన ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. పనుల ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి తోబాటు డీసీసీబీ డైరెక్టర్ శేఖర్ రెడ్డి, కమ్మర్ పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ పాలెపు నర్సయ్య పాల్గొన్నారు.

బోధన్‌లో గూడ్స్ రైలుకు సాంకేతిక లోపం

● రైల్వేగేటుకు ఇరువైపులా భారీ వాహనాలతో ట్రాఫిక్ జామ్
● సోషల్ మీడియాలో వచ్చిన పుకార్లను నమ్మొద్దన్న స్టేషన్ మేనేజర్

బోధన్‌రూరల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణంలోని రైల్వే గేటు వద్ద శనివారం గూడ్స్ రైలులో సాంకేతిక లోపం తలెత్తింది. సుమారు గంట పాటు రైలు అలాగే నిలిచిపోయింది. దీంతో రైల్వే గేటుకు ఇరువైపులా భారీ వాహనాలు పెద్ద సంఖ్యలో నిలిచిపోవడంతో.. వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రైల్వే సిబ్బంది సుమారు గంట పాటు శ్రమించి.. గూడ్స్ రైలును బాగు చేయడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. మరోవైపు.. ఇదే సమయంలో గూడ్స్ రైలు, రాయలసీమ ఎక్స్‌ప్రెస్‌లు ఎదురెదురుగా వచ్చాయని కొందరు సోషల్ మీడియాలో పుకార్లు లేపారు. దీంతో ఏం జరిగిందోనన్న గందరగోళం అంతటా నెలకొంది. ఈ విషయమై స్పందించిన బోధన్ రైల్వే స్టేషన్ మేనేజర్ దీయావత్ రాము.. సోషల్ మీడియాలో వచ్చిన పుకార్లను ఎవరూ నమ్మొద్దన్నారు. బోధన్‌లో రెండు రైళ్లు ఎదురుదెరుగా రాలేదని చెప్పారు. గూడ్స్ రైలు సాంకేతిక లోపాల వల్ల ఆగిపోయిందన్నారు. దీని వల్ల శనివారం బోధన్‌కు రావాల్సిన రాయలసీమ ఎక్స్‌ప్రెస్ నిజామాబాద్‌లోనే ఆగిపోయిందన్నారు.

కారు ఢీకొని చిట్టాపూర్ వాసి మృతి

ముప్కాల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): బాల్కొండ జాతీయరహదారిపై శనివారం రాత్రి కారు ఢీకొని మండలంలోని చిట్టాపూర్ గ్రామానికి చెందిన సాయం రాజానందం (55) అక్కడికక్కడే మృతి చెందినట్లు బాల్కొండ ఎస్సై నరేష్ తెలిపారు. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. చిట్టాపూర్ నుంచి రాజానందం తన రెండో భార్య సిద్దవ్వను తన బైక్‌పై తీసుకొని బాల్కొండ వైపు వస్తుండగా ఆర్మూర్ నుంచి ఆదిలాబాద్ వెళ్తున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో తలకు తీవ్రగాయాలతో రాజానందం అక్కడికక్కడే మృతి చెందగా భార్యకు తీవ్ర గాయాలయ్యాయి.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

మాక్లూర్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మాక్లూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రాంచంద్రపల్లి గ్రామశివారులో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ సయ్యద్ మౌలాన ఆసుపత్రిలో శనివారం చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు. ఎడపల్లి మండలం జాన్కంపేట్ గ్రామానికి చెందిన సయ్యద్ ఫీరోజ్‌తో కామారెడ్డి నుంచి మోటర్ బైక్‌పై వస్తుండగా రాంచంద్రపల్లి గ్రామశివారులో ఫీరోజ్ మోటర్ సైకిల్ అతివేగంగా అజాగ్రత్తగా నడపడంతో బైక్ స్కిడ్ అయి తలకు తీవ్రగాయాలయ్యాయి. దీంతో మౌలానకు తీవ్రగాయాలు కాగా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు.

విధులు సక్రమంగా నిర్వర్తించని
అధికారులు, ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్లపై చర్యలు

● డీఆర్డీవో పీడీ సురేందర్ హెచ్చరిక


సమావేశంలో మాట్లాడుతున్న పీడీ సురేందర్

రామారెడ్డి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): విధులు సక్రమంగా నిర్వర్తించని అధికారులు, ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్లపై కేసులు నమోదు చేస్తామని కామారెడ్డి జిల్లా డీఆర్‌డీవో పీడీ సురేందర్ హెచ్చరించారు. రామారెడ్డి మండల కేంద్రంలోని రైతు వేదిక కార్యాలయంలో శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకం మూడో విడత సామాజిక తనిఖీ ప్రజా వేదిక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన పీడీ సురేందర్ ఆధ్వర్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఉపాధి పథకంలో అవకతవకలపై ఆరా తీశారు. రామారెడ్డి మండలంలో 19 గ్రామ పంచాయతీల పరిధిలో ఇటీవల నిర్వహించిన ఉపాధిహామీ పనులపై ఆరా తీశారు. ఒక్కొక్కరికి ఉపాధి పనుల్లో డబ్బులు ఏ విధంగా పంపిణీ చేస్తున్నారు? పని చేయని వారికి డబ్బులు ఇవ్వడం? వసతులను ప్రభుత్వం మంజూరు చేసిన సామాగ్రిని కూలీలకు పంపిణీ చేశారా? అనే విధంగా ఆరా తీశారు. గత సంవత్సరం మాదిరిగా ఈ సంవత్సరంలో ఎన్ని తప్పులు జరిగాయని గ్రామాల వారీగా ఉపాధి సిబ్బందితో పంచాయతీ కార్యదర్శులతో ఆరా తీశారు. ఇటీవల ఉపాధి హామీ పనుల్లో అవకతవకలు జరిగాయని ఐకేపీ సంఘం లీడర్లకు తెలియకుండానే ఫీల్డ్ అసిస్టెంట్లు ఇష్టానుసారంగా పనిని బట్టి కాకుండా ఎక్కువ డబ్బులు ఇవ్వడం చేయడం ఎంత వరకు సమంజసం అని పూర్తి నివేదికలు సేకరించారు. అక్రమాలకు పాల్పడి ప్రభుత్వం నివేదికల ను సక్రమంగా పాటించని వారిపై త్వరలో సర్వే నిర్వహించి పూర్తి నివేదికలు సేకరించి నిందితులపై చర్యలు తీసుకుంటామని, కేసులు నమోదు చేస్తామని, డబ్బులను చెల్లించుకుంటామని హెచ్చరించారు. త్వరలో ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం వివిధ పంటలకు సంబంధించిన రుణాలు మంజూరు చేయడం జరుగుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి ఎంపీడీవో ఏలేటి తిరుపతిరెడ్డి, అధికారులు శ్రీనివాస్‌రావు, రాఘవన్, విప్లవకుమార్, ఏపీవో ధర్మారెడ్డి, గత ఇంచార్జి ఎంపీడీవో సవిత, ఉపాధి మండల స్థాయి అధికారులు మారుతి, కవిత, జగదీశ్వర్‌రెడ్డి, శ్రీనివాస్, నర్సయ్య, శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్లు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పచ్చలనడ్కుడలో సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత


చెక్కులను లబ్ధిదారులకు అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

వేల్పూర్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): వేల్పూర్ మండలం పచ్చల నడ్కుడ గ్రామంలో ముగ్గురు లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను కాంగ్రెస్ నాయకులు అందజేశారు. గ్రామానికి చెందిన ఈదుల్లా వంశీ, నోముల రాజు, సురినీడ బాజన్నలకు సంబంధించి రూ.55వేల సీఎంఆర్ఎఫ్ చెక్కులను కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు గుడాల మోహన్, కిసాన్‌ఖేత్ జిల్లా వైస్‌ప్రెసిడెంట్ టక్కరి గంగాధర్‌లు అందజేశారు. తమ చికిత్స కోసం సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక అందజేసిన సీఎం రేవంత్‌రెడ్డికి లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గొల్ల లింగేశ్వర్, గట్టువుతాల నర్సారెడ్డి, గడ్డనర్సయ్య, రాజేంధర్, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలను అమలు చేయాలి



మాట్లాడుతున్న ఏఐపీకేఎస్, ఏఐపీకేఎంఎస్ నాయకులు

ఆర్మూర్‌టౌన్, అక్టోబరు26(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఏఐపీకేఎస్ రాష్ట్ర కార్యదర్శి బి.దేవరాం, జిల్లా అధ్యక్షుడు ఎస్.సురేష్‌లు అన్నారు. శనివారం కుమార్‌నారాయణ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారంలోకి రావడానికి కాంగ్రెస్ పార్టీ వాగ్దానాల వర్షాన్ని కురిపించిందని, ఇప్పటి వరకు అమలు చేయకపోవడం విడ్డూరంగా ఉందని అన్నారు. అన్ని పంటలకు రూ.500బోనస్ ఇస్తామని చెప్పి రైతు భరోసాకు రెండు పంటలకు రూ.15వేలు, రైతులకు రూ.2లక్షల రుణమాఫీ, వ్యవసాయ కూలీలకు నెలకు వెయ్యి ఇస్తానని ఇప్పటివరకు అమలు చేయలేదన్నారు. ఈనెల 29న వ్యవసాయ కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలపై కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన చేపడతామని వారన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐపీకేఎంఎస్ జిల్లా ప్రధానకార్యదర్శి జి.కిషన్, కె.రాజేశ్వర్, భాజన్న, అశోక్, బాలయ్య, రాజన్న, లింబాద్రి, గంగాధర్, కె.కిషన్, యు.రాజన్న పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయ సందర్శన


తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న బోధన్ సబ్ కలెక్టర్

ఎడపల్లి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఎడపల్లి మండల తహసీల్దార్ కార్యాలయాన్ని శనివారం బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలోని పలు రికార్డులను ఆయన పరిశీలించి, ప్రభుత్వ భూముల వివరాలను ఆరా తీశారు. ధరణి ద్వారా చేపడుతున్న రిజిస్ట్రేషన్ వివరాలను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట ఎడపల్లి ఉప తహసీల్దార్ అనూష తదితరులు ఉన్నారు.

సిర్నూర్ కోటను సందర్శించిన విద్యార్థులు

మోపాల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సిర్పూర్ గ్రామంలో ఉన్న నైజాం కాలంలో నిర్మించిన కోటను శనివారం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు సందర్శించారు. నిర్మించిన కోట కట్టడాలను విద్యార్థులకు ఉపాధ్యాయులు వివరించారు. నైజాం కాలంలో రాజులు ఈ కోటలో ఉండేవారని ఈ కోట విశేషాలను కట్టడాలను, సొరంగ మార్గాలను విద్యార్థులకు వివరించారు. ఆ కాలంలో రాజులు ఈ కోటలో ఉండేవారని విద్యార్థులకు తెలియజేశారు. వీరి వెంట ప్రధానోపాధ్యాయురాలు నాగమణి, ఉపాధ్యాయులు రాము, అనురాధ, విద్యార్థులు ఉన్నారు.

పేకాట స్థావరంపై దాడి

● రూ. 6135 నగదు స్వాధీనం ● ఏడుగురు అరెస్ట్

రెంజల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దూపల్లి గ్రామంలో రహస్యంగా పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు ఎస్ఐ సాయన్న సిబ్బందితో వెళ్లి పేకాట స్థావరంపై దాడి ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుండి 6135రూపాయలు స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. మండలంలో ఎవరైనా పేకాట ఆడితే రెంజల్ పోలీసులకు సమాచారం అందించాలని, సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. పేకాట ఆడితే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు విద్యార్థిని ఎంపిక

ఆర్మూర్‌రూరల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని లావణ్య రాష్ట్రస్థాయి జూనియర్ ఖో ఖో పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం రవీందర్ తెలిపారు. ఈ నెల 28వ తేదీ నుంచి మహబూబ్‌నగర్‌లో జరగనున్న రాష్ట్రస్థాయి ఖోఖో పోటీల్లో లావణ్య పాల్గొంటుందన్నారు. ఎంపికైన విద్యార్థినిని ఉపాధ్యాయులు అభినందించారు.

మోడల్ పాఠశాల విద్యార్థి..

ముప్కాల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): నందిపేట మండల కేంద్రంలో నిర్వహించి జిల్లాస్థాయి ఖోఖో పోటీల అండర్ -19 విభాగంలో మంచి ప్రతిభ కనబరిచిన విద్యార్థిని డి.అపర్ణను ఎంపిక చేశారు. బాల్కొండ మోడల్ స్కూల్‌లో ఇంటర్ సీఈసీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని అపర్ణ ఈ నెల 28, 29, 30 తేదీల్లో మహబూబ్‌నగర్ జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనున్నట్లు మోడల్ స్కూల్ పీడీ ముత్తెన్న తెలిపారు. విద్యార్థిని లావణ్యను మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

తొర్లికొండలో ఘనంగా వెంకటేశ్వరస్వామి ఉత్సవాలు

జక్రాన్‌పల్లి,, అక్టోబరు26(ఆంధ్రజ్యోతి): మండలంలోని తొర్లికొండ గ్రామంలో శ్రీ వెంకటేశ్వరస్వామి ఉత్సవాలను భక్తులు, గ్రామస్థులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. తెల్లవారు జాము నుంచే భక్తులు అధిక సంఖ్యలో కొండపైకి చేరుకున్నారు. అనంతరం స్వామివారి పల్లకిని భక్తులు కొండపై చుట్టూ ప్రదక్షిణ చేయించారు. ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయం వద్ద భక్తుల కోసం అన్నదానం నిర్వహించారు.

ఘనంగా ఐఎన్‌టీయుసీ ఆవిర్భావ దినోత్సవం

ఆర్మూర్‌టౌన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జిరాయత్ నగర్ విద్యుత్ కార్యాలయం వద్ద ఐఎన్‌టీయుసీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 327యూనియన్ పథకాన్ని ఆవిష్కరించి యూనియన్ నాయకులు స్వీట్లు పంపిణీ చేసుకున్నారు. గత 70 ఏళ్ల నుంచి కార్మికుల శ్రేయస్సు కోసం ఐఎన్‌టీయుసీ 327కార్మికుల పక్షాన పోరాడు తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టీయుసీ డివిజన్ అధ్యక్షుడు సల్ల శ్రీనివాస్, కార్యదర్శి ఎస్.చందర్ నాయక్ పాల్గొన్నారు.

పల్లెలపై పట్టింపేదీ!?

ఆంధ్రజ్యోతి ఫోకస్


ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులు

- అడ్రస్ లేని స్పెషల్ ఆఫీసర్లు
- బాధ్యతగా కొందరు, భారంగా ఇంకొందరు
- గ్రామాల వైపు కన్నెత్తి చూడని పలువురు
- పారిశుధ్యం నీటి సరఫరా అస్తవ్యస్తం
- వ్యాధులు వ్యాపిస్తున్నా చర్యలు శూన్యమే..

ఎల్లారెడ్డి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): పల్లెల్లో సమస్యలు తాండవిస్తున్నాయి. పంచాయతీ పాలకవర్గాలు లేకపోవడం, ప్రత్యేక అధికారులు పట్టించుకోకపోవడం ఇందుకు కారణాలుగా కనిపిస్తున్నాయి. దీనికి తోడు నిధుల కొరతతో కనీస మరమ్మతులు కూడా చేయించలేని పరిస్థితి ఏర్పడింది. పంచాయతీ ఖాజానాలో నిధుల సమస్య వల్ల చెత్త సేకరించడానికి వినియోగించే ట్రాక్టర్లలో డీజిల్ నింపలేని దుస్థితి పలు చోట్ల నెలకొంది.

పల్లెల వైపు చూడని ప్రత్యేక అధికారులు

కామారెడ్డి జిల్లాలోని 526 గ్రామ పంచాయతీల ఉన్నాయి. ఫిబ్రవరి నుంచి ఈ గ్రామాలకు ప్రభుత్వం ప్రత్యేక అధికారులను నియమిం చారు. మండల డివిజన్ స్థాయి అధికారులకు అదనపు బాధ్యతలు అప్పగించారు. తమ మాతృశాఖలతో పాటు ప్రత్యేక అధికారులుగా పల్లెలను సైతం పర్యవేక్షించాలని ఆదేశిలిచ్చారు. కానీ చాలా మంది ప్రత్యేక అధికారులు పట్టించుకోవడం లేదు. వారానికోసారి కూడా గ్రామాల వైపు కన్నెత్తి చూడటం లేదు. కనీస అవసరాలకు సైతం ప్రజలు ఇబ్బందులు పడుతున్నా పట్టించుకోవడం లేదని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నిధుల కొరత కారణంగా గ్రామంలో తప్పనిసరిగా చేపట్టాల్సిన పనులకు పంచాయతీ కార్యదర్శులు సొంతంగా డబ్బులు వేచ్చిస్తున్నట్లు తెలుస్తోంది. ఆరు నెలలుగా ప్రత్యేక అధికారులను నియమించినప్పటికీ వారి ముద్ర కాన రావడం లేదు.

రోగాల బారిన పడుతున్న ప్రజలు

గ్రామాల్లో అపరిశుభ్రత కారణంగా వ్యాధులు విజృంభిస్తున్నాయి. అందుకు గ్రామాల్లో ప్రత్యేక అధికారులు ప్రత్యేకంగా దృష్టి సారించాలి. మురికి కాలువలు, ఇళ్ల సమీపాల్లో చెత్తాచెదారం మురికి కాలువల్లో నీరు నిల్వ ఉండటంతో దోమలు ప్రబలుతున్నాయి. మురికి కాలువల్లో ఉన్న నీరు మళ్లించే ప్రయత్నాలు జరగడం లేదు. అదే విధంగా గ్రామాల్లో రక్షణ చర్యలు చేపట్టం లేదని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. పలు గ్రామాల్లో అడ్డగోలుగా పందుల స్వైర విహారం చేస్తున్నాయి. కనీసం ప్రత్యేక అధికారులు పర్యవేక్షించేలా జిల్లా ఉన్నతాధికారులు ఆదేశించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ప్రభుత్వ ఆసుపత్రిలో పెరిగిన రోగుల సంఖ్య

గ్రామాల్లో రోడ్లు, మురికి కాలువలు, తాగునీటి సమస్య విపరీతంగా ఉండటంతో దానికి తోడు ప్రత్యేక అధికారులు గ్రామాల వైపు కన్నెత్తి చూడటం లేదు. ఒక్కో అధికారికి నాలుగు నుంచి ఐదు గ్రామాలు ప్రత్యేక అధికారి బాధ్యతలు అప్పగించారు. బాధ్యతలు స్వీకరించిన నుంచి ఇప్పటి వరకు గ్రామాల వైపు కొందరు ప్రత్యేక అధికారులు చుట్టపు చూపులాగా వచ్చి వెళుతున్నారు. దీంతో పల్లెల్లో ఉండే ప్రజలకు పరిశుభ్రత లేకపోవడం వల్ల సీజనల్ వ్యాధులతో బాధపడుతూ ఉన్నారు. ప్రత్యేక అధికారులు గ్రామాల వైపు రావడం లేదని గ్రామీణ ప్రాంత ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇందుకు సంబంధిత అధికారులపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని గ్రామీణ ప్రాంత ప్రజలు ఆరోపిస్తున్నారు.

గ్రామాల్లో వైద్య శిబిరాలు కరువు

సీజనల్ వ్యాధుల దృష్ట్యా గ్రామాల్లో మురికి కాలువలు పారిశుధ్య లోపం, తాగునీటి సమస్యతో గ్రామీణ ప్రాంత ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారు. రోగులు ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లడానికి స్థోమత లేకపోవడం స్థానికంగా వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్యంపై అవగాహన కల్పించడం కరువైంది. ఒక పక్క ప్రత్యేక అధికారుల నిర్లక్ష్యం, మరో పక్క వైద్య సిబ్బంది, సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పించక పోవడం వల్ల గ్రామీణ ప్రాంత ప్రజలకు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన సదస్సులతో పాటు హెల్త్ క్యాంపులు నిర్వహించాలని కోరుతున్నారు.


కళ్యాణి గ్రామంలో రోడ్డుపై నిలిచిన మురికి నీరు


మురికి కాలువలు శుభ్రం లేక నిండిన మురుగు నీరు


ప్రభుత్వ పాఠశాల వెనుక రోడ్డు పక్కనే చెత్త

ఏఈవోలకు పని ఒత్తిడి!

- ప్రభుత్వ నిబంధల ప్రకారం 5వేల ఎకరాల లోపు విస్తీర్ణం వరకే సర్వే
- దోమకొండలో ఇద్దరే ఏఈవోలు
- ఒక్కొక్కరికి 6,500 ఎకరాల విస్తీర్ణం కేటాయింపు




తుకం మడిని పరిశీలిస్తున్న డీఏవో భాగ్యలక్ష్మి, ఏఈవో శ్రీలత(ఫైల్)

దోమకొండ, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): సర్వే పని ఒత్తిడితో ఏఈవోలు సతమతమవుతున్నారు. ప్రభుత్వం క్లస్టర్ ప్రకారం.. ఏఈవోలను నియమించి రైతు వేదికల్లో రైతులకు సేవలు అందించాలనే ఆలోచనతో ప్రణాళిక చేసింది. అన్ని భాగనే ఉన్నప్పటికి ఏఈవోలకు పనిభారం ఎక్కువై ఒత్తిడికి లోనవుతున్నారు. దోమకొండ పరిధిలో మొత్తం 12,552 ఏకారాల సాగు విస్తీర్ణం ఉంది. ఇందులో ఇద్దరు ఏఈవోలకు ఒకోక్కరికి 6వేల2వందల 76 ఎకరాలకు విధులు నిర్వహించవలసి వస్తోంది. కాగా, దోమకొండ మండలంలోని అంబార్‌పేట, దోమకొండ క్లస్టర్‌లో భాగంగా వర్షకాలం పంటల సాగు అదనంగా ఉందంటున్నారు. ఏఈవోలకు ప్రభుత్వ నిబంధనల కంటే 1200 పైగా విస్తీర్ణం ఎక్కువగా ఉండటంతో పంటల సర్వేల సమయంలో ఏఈవోలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మండల రైతులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

గ్రామం	వరి	మక్క	పత్తి	మామిడి	బ్లాక్‌గ్రామ్	గ్రీన్‌గ్రామ్	రెడ్‌గ్రామ్	మొత్తం
అంబార్‌పేట	1937	0	1	15	0	0	0	1961
అంచనూర్	1364	5	380	9	19	0	5	1801
సంగమేశ్వర్	1417	1	0	46	0	0	0	1466
సీతారాంపల్లి	331	0	17	0	0	0	0	352
సీతారాంపూర్	975	0	6	5	0	0	0	992
చింతమాన్‌పల్లి	602	25	22	15	22	2	15	717
దోమకొండ	2269	18	67	124	54	17	25	2652
కుందారం	321	0	0	3	0	1	0	328
లింగుపల్లి	317	1	2	0	33	3	0	371
ముత్యంపేట	1723	29	9	84	6	2	19	1914
	11,260	80	507	305	135	25	65	12,552

ఫొటో న్యూస్




● నగరంలోని పూలాంగ్ చౌరస్తా వద్ద ప్రమిదల షాపుల వద్ద కొనుగోళ్ల సందడి


● ఆసక్తిగా చూస్తున్న మహిళలు






లక్ష్మీగణపతి ప్రతిమలు






● గుజరాత్ నుంచి వచ్చిన మట్టి ప్రమిదలు

మార్కెట్లో దీపావళి సందడి

● ప్రమిదలకు పెరిగిన గిరాకీ!

మరో నాలుగు రోజుల్లో దీపావళి పండుగ ఉండటంతో ప్రమిదల గిరాకీ ఊపందుకుంది. పూలాంగ్ చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన ప్రమిదల దుకాణాల వద్ద వినియోగదారుల సందడి పెరిగింది. గుజరాత్, ముంబాయి, కోల్‌కత్తా, బనారస్ నుంచి వచ్చిన వ్యాపారులు తమ వస్తువులను విక్రయిస్తున్నారు. గంగా, బనారస్‌లలో తయారైన మట్టి ప్రమిదలకు గిరాకీ ఎక్కువగా ఉంది. సుమారు పండుగకు పది రోజుల ముందే వీరు నగరంలో తాత్కాలిక గుడాలను ఏర్పాటు చేసుకొని వ్యాపారం చేస్తున్నారు. మట్టి ప్రమిదలకు ఆకర్షనీయమైన రంగులు అద్ది వినియోగదారులను ఆకర్షిస్తున్నారు. 10 రూపాయల నుంచి 200 రూపాయల వరకు ప్రమిదలను విక్రయిస్తున్నారు. లక్ష్మీదేవి, గణపతి, తదితర దేవతా మూర్తుల మట్టి విగ్రహాలను కూడా విక్రయిస్తున్నారు. వీటితో పాటు పూలకుండీలు, ప్లాస్టిక్ పువ్వులను దుకాణాల్లో అమ్ముతున్నారు.


(- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్)


● ముంబాయి నుంచి వచ్చిన ప్రమిదలు


● కోల్‌కత్తా నుంచి వచ్చిన ప్రమిదలు


● దొంతులు


● నెమలి అలంకరణలో పూలకుండీ


● ఏనుగు బొమ్మ

ఆంధ్రజ్యోతి పరిశీలన

పల్లె ప్రకృతి వనాలపై పట్టింపు కరువు!

- నిరుపయోగంగా నీటి ట్యాంకర్లు
- కోతుల ఆహారశాలలు కనుమరుగు
- పట్టించుకోని ప్రత్యేకాధికారులు



రాజంపేట, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): గ్రామాల సర్పంచ్‌ల పదవీకాలం గత జనవరితో ముగియగా ప్రభుత్వం పంచాయతీ పాలనకు ప్రత్యేకాధికారులను కేటాయించింది. ప్రత్యేకాధికారులు పర్యవేక్షణకు వచ్చి కార్యాలయానికి పరిమితం అవుతుండడంతో పల్లెలో ప్రజలకు అవస్థలు తప్పడం లేదు. పట్టణాలు మాదిరిగానే పల్లెల్లో ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించేందుకు గత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పల్లె ప్రకృతివనాలు, కోతుల ఆహారశాల ఏర్పాటు చేసిన దాని నిర్వహణ మాత్రం గాలికివదిలేశారు. కామారెడ్డి జిల్లాలో పల్లె ప్రకృతి వనాల నిర్వహణ తీరుపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం..


పొందుర్తి ప్రకృతివనంలో విరిగిపోయిన బెంచీ


ప్రకృతివనంలో ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలు ఇలా..

● కోతుల ఆహారశాలలు కనుమరుగు

రాజంపేట మండలంలోని 18 గ్రామ పంచాయతీలలో పల్లె ప్రకృతివనాలు ఏర్పాటు చేశారు. పొందుర్తి గ్రామంలో గ్రామానికి కిలోమీటర్ అవతల జన సంచారంలేని భూమిలో పల్లె ప్రకృతివనం ఏర్పాటు చేశారు. వనంలో విరిగిన బెంచీలు, పిచ్చిమొక్కలు దర్శనం ఇస్తున్నాయి. ఇదేకాక ప్రతీ గ్రామంలో పల్లె ప్రకృతి వనాలు ఎండిపోతున్నాయి కనీసం పంచాయతీ అధికారులు అటువైపు చూసిన పాపానపోలేదు. గ్రామ పంచాయతీలలో ఉండాల్సిన అధికారులు మండల కార్యాలయంలో సమావేశాలు ఉన్నాయంటూ వెళ్లిపోతున్నారు. మధ్యాహ్నం దాటితే చాలాచోట్ల పంచాయతీ కార్యదర్శులు కనిపించడం లేదు. ప్రజలకు ఏదైనా అత్యవసరమయితే మరుసటి రోజు వరకు వేచిచూడాల్సి వస్తుంది. పల్లె ప్రకృతి వనాల్లో కోతుల ఆహారశాలలు ఉన్నాయా? లేవా? అనేది అర్థం కాని పరిస్థితి. ఎటుచూసిన పిచ్చిమొక్కలే కనికనిపిస్తున్నాయి. నిర్వహణ అధ్వానంగా మారింది. సిబ్బందితో వాటర్ ట్యాంకర్ల ద్వారా చెట్లకు నీరు అందించాల్సి ఉన్నా.. నిర్లక్ష్యం చేస్తున్నారనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

● కనిపించని ప్రత్యేకాధికారులు

పల్లె ప్రకృతి వనాలతో పాటు ఇతర పనులను పరిశీలించాల్సిన ప్రత్యేకాధికారులు పల్లెలో కనిపించడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. అడపదడప కొన్నిచోట్లకు వస్తున్నా.. తిరిగి కార్యాలయానికే పరిమితమవుతున్నారు. దీంతో పల్లె ప్రకృతివనాలు, నర్సరీలు, సైడ్ కాలువల్లో పైపులైన్, సీసీ రోడ్లు, పారిశుధ్యం అధ్వానంగా మారింది. వివిధ శాఖలకు చెందిన మండల స్థాయి గెజిటెడ్ అధికారులను గ్రామాల ప్రత్యేక అధికారులుగా నియమించడంతో వారి శాఖలకు చెందిన పనుల్లోనే తలమునకలవుతున్నారు.

ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూస్తాం

: రాజేశం, ఎంపీడీవో, రాజంపేట



మండలంలోని ప్రత్యేకాధికారులకు మూడు నుంచి నాలుగు గ్రామపంచాయతీలు కేటాయించారు. ప్రతిరోజు గ్రామపంచాయతీలలో పనులు పరిశీలిస్తు మండల స్థాయి పనులు చేస్తున్నారు. పొందుర్తి గ్రామంలో పల్లె ప్రకృతి వనానికి సరిపడేప్రభుత్వ భూమిలేనందున గ్రామస్తుల నిర్ణయం మేరకు ఎండోమెంట్‌ల్యాండ్‌లో ఏర్పాటుచేశారు. గ్రామపంచాయతీ కార్యదర్శులు అత్యవసర సమయాల్లోతప్ప మిగిలిన సమయాల్లో గ్రామపంచాయతీలలోనే ఉండాలి. ఒకవేళ ప్రజలకు అందుబాటులో లేనట్లు ఫిర్యాదు అందితే చర్యలు తీసుకుంటాం. పల్లెప్రకృతివనం,కోతుల ఆహారశాలల పర్యవేక్షణపై తక్షణ చర్యలు చేపడుతాం.

ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయడం లేదు

● కమిటీల పేరుతో కాలయాపన ● ప్రభుత్వంపై ప్రశాంత్‌రెడ్డి విమర్శ



విలేకరులతో మాట్లాడుతున్న బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి

నిజామాబాద్, అక్టోబరు26 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలుపర్చడం లేదని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి విమర్శించారు. శనివారం బాల్కొండ నియోజకవర్గంలో ఆయన విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందన్నారు. ఇచ్చిన హామీలను అమలు పర్చకుండా కమిటీల పేరుతో కాలయాపన చేస్తోందని ఆయన విమర్శించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం కేసీఆర్ గత పదేళ్లలో రైతు సంక్షేమానికి పాటుపడిందన్నారు. దేశంలో ఎక్కడలేని విధంగా నాణ్యమైన విద్యుత్‌ను 24గంటలు సరఫరా చేశారని అన్నారు. రైతులు పండించిన ప్రతీ గింజను మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేసి వారి ఖాతాల్లో జమ చేసిందన్నారు. ఏకకాలంలో రైతులకు రుణమాఫీ చేస్తామని చెప్పి కొందరికి మాత్రమే ఇచ్చి మిగిలిన వారికి కాలయాపన చేస్తుందన్నారు.ఈ ప్రభుత్వం ఇప్పటికీ రైతుబంధు ఊసే ఎత్తడం లేదన్నారు. రానున్న ఖరీఫ్ కూడా రైతుబంధు వేసే ఆలోచనలో కాంగ్రెస్ ప్రభుత్వానికి లేదన్నారు. అన్ని రకాల ధాన్యానికి రూ.500 బోనస్ ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చి నేడు కేవలం సన్నరకం ధాన్యానికే ఇస్తామనడం వారి దిగజారుడు తనానికి నిదర్శనమన్నారు. అగ్రికల్చర్ పోర్టల్‌లో ఉన్న సమాచారాన్ని బట్టి ప్రైవేటు దళారులకు ధాన్యాన్ని అమ్మిన రైతులకు కూడా ఎకరానికి 26క్వింటాలు లెక్కచేసి రూ.500 బోనస్ ఇవ్వాలన్నారు. సన్నరకం ధాన్యానికే కాకుండా దొడ్డు ధాన్యానికి కూడా రూ.2800 చెల్లించి ప్రభుత్వమే కొనుగోలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

మంచినీటి కోసం మహిళల ఆందోళన



నీళ్ల కోసం నిరసన చేస్తున్న దృశ్యం

మోస్రా,అక్టోబరు26(ఆంధ్రజ్యోతి): మంచి నీటి కోసం మహిళల ఆందోళన నాలుగు రోజులుగా తాగునీరు లేక ఇబ్బంది పడుతున్న వైనం ఏర్పడింది. వివరాల్లోకి వెళితే మండలంలోని చే నెంబర్ దుబ్బతండా గ్రామంలో దర్గా వైపు గల కాలనీ వాసులకు, ఆ పక్కనే గల మరో కాలనీ వాసులకు గత నాలుగు రోజులుగా నీళ్లు రావడం లేదని తండా మహిళలు గ్రామ పంచాయతీ ముందు ఖాళీ బిందెలు చూపుతూ నిరసన వ్యక్తం చేశారు. గ్రామ పంచాయతీ సిబ్బందికి నీళ్లు రావట్లేదు అని ఎన్నిసార్లు మొరపెట్టుకున్న పట్టించుకోవడం లేదని కాలనీలో గల ఒక మోటార్ బోర్ వద్ద గల స్టార్టర్, ఫ్యూజ్‌లు సైతం ఎవరో ఎత్తుకెళ్లారని గ్రామంలో ఎక్కడ పడితే అక్కడ పైపులైన్ పగిలి లీకేజీ ఉన్నాయి. ఈ సమస్యలు పరిష్కారం చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

● సమస్యను వెంటనే పరిష్కరిస్తాం

ఇట్టి విషయంపై ఎంపీవోను వివరణ కోరగా గ్రామ పంచాయతీకి వెళ్లి విచారణ చేసి సమస్యలు పరిష్కరిస్తామని ఎంపీవో వెంకటేశ్వర్లు తెలిపారు.

ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను రెగ్యులరైజ్ చేసుకోవాలి

● నుడా చైర్మన్ కేశవేణు

సుభాష్‌నగర్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ నుడా పరిధిలోని లే అవుట్ లేని ప్లాట్ యజమానులు 2020లో ఎల్ఆర్ఎస్ కొరకు వెయ్యి రూపాయలు కట్టిన వారికి ప్రభుత్వం రెగ్యూలరైజ్ చేసుకునే అవకాశం ఇచ్చిందని కావున ఈ అవకాశాన్ని ప్రతీ ఒక్క ప్లాటు యజమానులు సద్వినియోగం చేసుకోవాలని నుడా చైర్మన్ కేశవేణు ఒక ప్రకటనలో తెలిపారు. నిజామాబాద్ నుడా పరిధిలో 4511 మంది రెగ్యులరైజ్ కోసం దరఖాస్తులు చేసుకున్నారని కావున ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

టీయూలో కబడ్డీ క్రీడాకారుల ఎంపిక

డిచ్‌పల్లి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ యూనివర్సిటీ వీసీ ఆదేశాల మేరకు ఇంటర్ కాలేజీ కబడ్డీ క్రీడాకారుల ఎంపిక శనివారం స్పోర్ట్స్ డైరెక్టర్ డాక్టర్ బాల్‌కిషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ ఎంపికలో ఉమ్మడి జిల్లా నుంచి 50 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. క్రీడానైపుణ్యం కలిగి క్రీడల్లో ప్రతిభ చాటాలని డైరెక్టర్ బాల్‌కిషన్ సూచించారు. ఈఎంపిక కార్యక్రమంలో ఆర్గనైజింగ్ సెక్రెటరీ నేత, ఫిజికల్ డైరెక్టర్లు బాలమణి, కుమారస్వామి, ప్రశాంత్, బుచ్చన్న, కళాశాల ప్రిన్సిపాల్ ఆరతి, పీఆర్వో పున్నయ్య వార్డెన్‌లు పాల్గొన్నారు.

అంతరెడ్డి రాజరెడ్డిని కలిసిన బాసర ట్రిపుల్ ఐటీ లైబ్రేరియన్



అంతరెడ్డి రాజరెడ్డిని కలిసిన బాసర ట్రిపుల్ ఐటీ లైబ్రేరియన్

నిజామాబాద్ అర్బన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన అంతరెడ్డి రాజరెడ్డిని బాసర ట్రిపుల్ ఐటి లైబ్రేరియన్ కె.అరుణ, ఇతర లైబ్రేరియన్‌లు మర్యాదపూర్వకంగా కలిశారు. శనివారం ఆయన నివాసంలో ఆయనను కలిసి సన్మానించారు. గిరిరాజ్ కళాశాల పూర్వపు లైబ్రేరియన్ వీరప్రసాద్, రాంకిషోర్, తదితరులు ఆయనను పుష్పగుచ్ఛం, శాలువాతో ఘనంగా సన్మానించారు.

బీసీ కమిషన్ పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు

● సన్నాహక సమావేశంలో అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్

నిజామాబాద్ అర్బన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో స్థానిక సంస్థల వారిగా కల్పించాల్సిన రిజర్వేషన్ల దామాషాపై ఆయా రాజకీయ పార్టీలు, సంఘాలు, ప్రజల అభిప్రాయాలను తెలుసుకునేందుకు వీలుగా తెలంగాణ బీసీ కమిషన్ ప్రతినిధుల బృందం ఈనెల 29న నిజామాబాద్‌కు విచ్చేస్తున్న నేపథ్యంలో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ ఎస్.కిరణ్‌కుమార్ అధికారులకు సూచించారు. బీసీ కమిషన్ పర్యటనను దృష్టిలో పెట్టుకొని శనివారం ఐడీవోసీలో సంబంధిత అధికారులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్ ఆయా శాఖల అధికారులకు వారు నిర్వహించాల్సిన విధుల గురించి వివరిస్తూ బాధ్యతలను అప్పగించారు. నిజామాబాద్, కామారెడ్డి ఉమ్మడి జిల్లాకు సంబంధించి ఈనెల 29న నిజామాబాద్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు కమీషన్ చైర్మన్ నిరంజన్ నేతృత్వంలోని బీసీ కమిషన్ స్థానిక సంస్థలో రిజర్వేషన్ల దామాషాపై అభిప్రాయాలు సేకరిస్తుందన్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు నిజామాబాద్ జిల్లాకు సంబంధించి భోజన విరామం అనంతరం మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు కామారెడ్డి జిల్లాకు చెందిన వారు రాత పూర్వకంగా తమ అభిప్రాయాలను కమిషన్‌కు నివేదించవచ్చని తెలిపారు. అభిప్రాయాల సేకరణ కోసం విచ్చేస్తున్న బీసీ కమిషన్ పర్యటన గురించి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా విస్తృత ప్రచారం చేయాలని సూచించారు. కమిషన్ పర్యటనను పురస్కరించుకొని ఆయా శాఖల వారిగా అధికారులు, సిబ్బందికి కేటాయించిన విధులను తూచాతప్పకుండా పాటించాలని అవసరమైన అన్ని ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేసుకోవాలన్నారు.కమిషన్ ప్రజాభిప్రాయ సేకరణ జరుపనున్న దృష్ట్యా ఈ ప్రక్రియకు ఎక్కడ కూడా ఏ చిన్న అవాంతరం తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని హితవు పలికారు. తమ అభిప్రాయాలను కమీషన్‌కు నివేదించేందుకు హాజరయ్యే వారికి సహకరించేందుకు వీలుగా రెండు హెల్ప్ డెస్కులను ఏర్పాటు చేస్తున్నామని ఆ హెల్ప్ డెస్కుల వద్ద సరిపడా సిబ్బందిని, అవసరమైన స్టేషనరీని అందుబాటులో ఉంచాలన్నారు. అభిప్రాయాలు తెలియజేయాలనుకునే వారు రాతపూర్వక సమర్పణలు, అభ్యర్థనలను నేరుగా సమర్పించవచ్చని సూచించారు. వారి అభ్యర్థనలతో పాటు నిర్దేశిత నమూనాలో వెరిఫికేషన్ అఫిడవిట్ ఆరు సెట్లను అందజేయాల్సి ఉన్నందున రిజిస్ట్రేషన్, హెల్ప్‌డెస్క్ విభాగాల వద్ద విధులు నిర్వర్తించే అధికారులు, సిబ్బంది క్రియాశీలకంగా వ్యవహరించాల్సి ఉంటుందన్నారు. ప్రజాభిసేకరణ అనంతరం వినతిపత్రాలతో కూడిన పూర్తి వివరాలు, వీడియోలు,ఫోటోగ్రాఫ్ తదితర వాటిని కమీషన్‌కు సమర్పించాల్సి ఉన్న ందున అన్నింటిని జాగ్రత్తగా సిద్ధం చేసుకోవాలని సూచించారు. ఎలాంటి ఒడిదుడుకులకు తావులేకుండా అవసరమైన బందోబస్తును ఏర్పాటు చేస్తామని అదనపు డీసీపీ కోటేశ్వర్‌రావు తెలిపారు. ఈ సమావేశంలో డిఆర్‌డివో సాయాగౌడ్, బీసీఅభివృద్ధి అధికారిని స్రవంతి, నిజామాబాద్ ఆర్డీవో రాజేంద్రకుమార్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రమేష్ పాల్గొన్నారు.

సివిల్ పోలీసులలాగే డ్యూటీలు ఉండాలి

● ఇన్‌చార్జి సీపీకి విన్నవించిన బెటాలియన్ పోలీసులు



బెటాలియన్‌లో మాట్లాడుతున్న ఇన్‌చార్జీ సీపీ సింధూశర్మ

డిచ్‌పల్లి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి):తమకు సివిల్ ఏఆర్ కానిస్టేబుల్ విధంగా డ్యూటీలు ఉండాలని తాము నెలల తరబడి ఇతర ప్రాంతాల్లో విధులు చేయలేమని తమ పరిస్థితిని చూసి తమ భార్యలు రోడ్డెక్కారని ఏడవ పోలీస్ బెటాలియన్‌లో శనివారం మధ్యాహ్నం ఇన్‌చార్జి సీపీసింధూశర్మకు విన్నవించారు. గత రెండు రోజుల క్రితం ఏడో పోలీస్ బెటాలియన్‌కు చెందిన పోలీస్ సిబ్బంది కుటుంబీకులు రాస్తారోకో చేయడంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ ఘటనను తీవ్రంగా పరిగణించి బెటాలియన్ పోలీసుల వాస్తవ పరిస్థితులు తెలుసుకోవాలని ఇన్‌చార్జి సీపీ సింధూశర్మను ఏడవ బెటాలియన్‌కు శనివారం పంపినట్లు తెలుస్తుంది. ఈ సందర్భంగా రెండు గంటల పాటు బెటాలియన్ సిబ్బంది, అధికారుల విషయాలను ఆమె స్వయంగా అడిగి తెలుసుకొని ప్రభుత్వానికి మీ సమస్యలు వివరిస్తానని హామీ ఇచ్చారు. తామందరికి ఒకే తరహా విధులు కావాలని తామందరిని ప్రభుత్వం ఇట్టి విధులు అమలు చేసే వరకు ఎస్పీలకు, సీపీ కార్యాలయాలకు డ్యూటీలు పంపేవిధంగా చొరవ చూపాలని పేర్కొన్నారు. తమ బెటాలియన్‌లో మెస్ మూసి వేయాలని తాము పర్మిషన్‌లకు కూడా చేయలేమని ఖచ్చితంగా ఇండ్ల వద్ద నుంచి విధులు నిర్వహిస్తామని పేర్కొన్నారు. తాము డ్యూటీల విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం చేయమని శాంతిభద్రతలే ధ్యేయంగా పనిచేస్తామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి సీపీ సింధూశర్మ మాట్లాడుతూ ఏడోబెటాలియన్‌కు చెందిన సిబ్బంది తమకు నివేదించిన వివరాలను డీజీపీకి అందజేస్తానని విధుల పట్ల ఎలాంటి ఆందోళన అవసరం లేదని పేర్కొన్నారు.

● హైదరాబాద్ శౌర్య భవన్‌కు ఏఆర్ఎస్సై బదిలీ

గత 20 ఏళ్లుగా డిచ్‌పల్లి ఏడవ పోలీస్ బెటాలియన్‌లో ఏఆర్ఎస్సైగా కొనసాగుతున్న లాల్ హైమద్‌ను హైదరాబాద్‌లోని శౌర్యభవన్‌కు ఉన్నతాధికారులు శనివారం బదిలీ చేశారు. పలువురు బెటాలియన్ సిబ్బంది శుక్రవారం అడిషనల్ డీజీకి లాల్ విషయంలో ఫిర్యాదు చేయడంతో పోలీసు అధికారులు బదిలీ చేసినట్లు తెలుస్తోంది.

● టపాకాయల దుకాణ నిర్వాహకులు అనుమతులు తీసుకోవాలి

ఖిల్లా:దీపావళి పండుగ సందర్భంగా టపాకాయాల దుకాణాలు ఏర్పాటు చేసే నిర్వహకులు పోలీసు శాఖ డివిజన్ స్థాయి అధికారి అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని ఇంచార్జీ సీపీ సింధూశర్మ తెలిపారు. పోలీసు కమీషనరేట్ పరిధిలో తాత్కలికంగా టపాకాయల దుకాణాలు నెలకొల్పేవారు వారి వారి సంబంధిత పోలీసు డివిజన్ స్థాయి అధికారి కార్యాలయం నుంచి ధరఖాస్తు చేసుకుని అనుమతి పొందాలన్నారు. దానికి సంబంధించిన ఇతర సమాచారం కోసం సంబంధిత డివిజన్ స్థాయి అధికారిని సంప్రదించాలని సూచించారు. ఎవరైనా సంబంధిత డివిజన్ స్థాయి అధికారి నుంచి అనుమతులు తీసుకోకుండా టపాకాయల దుకాణాలు ఏర్పాటు చేసినట్లయితే వారిపై ఎక్స్‌ప్లోజివ్ యాక్టు 1884, రూల్స్-1933సవరణ 2008 ప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. టపాకాయల దుకాణాలు సంబంధిత ఖాళీ ప్రదేశాల్లో నెలకొల్పాలన్నారు. ఖాళీ ప్రదేశానికి సంబంధించిన ఎన్ఓసి సర్టిఫికేటు పొందుపర్చాలన్నారు. ఒక క్లస్టర్‌లో 50దుకాణాలకు మించరాదన్నారు. జనరద్దీగల ప్రదేశాల్లో ఎలాంటి టపాకాయల దుకాణాలు ఏర్పాటు చేయరాదన్నారు. అదేవిధంగా కళ్యాణ మండపాలల్లో, సమావేశాల కేంద్రాల్లో టపాకాయల దుకాణాలు ఏర్పాటు చేయరాదన్నారు. తాత్కలిక టపాకాయల దుకాణాల్లో ఫైర్‌కు సంబంధించిన జాగ్రత్తలు తప్పక పాటించాలన్నారు. ఇట్టి ధరఖాస్తు ఫారం పోలీసు వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్‌లో పొందపర్చడం జరిగిందన్నారు. అట్టి ధరఖాస్తు ఫారం డౌన్‌లోడ్ చేసుకుని పూర్తి వివరాలతో సంబంధిత ఏసీపీ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

నేడు బోధన్‌లో త్యాగరాజ శతగళ ఆరాధన ఉత్సవం



సమావేశంలో మాట్లాడుతున్న దృశ్యం

బోధన్ రూరల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : బోధన్‌లో సద్గురు శ్రీ త్యాగరాజ స్వామి వారి శతగళ ఆరాధన ఉత్సవాలను ఆదివారం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. శనివారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. ఈ నెల 27వ తేదీన శక్కర్‌నగర్‌లోని శ్రీరామ మందిరంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. దాదాపు వందపై చిలుకు సంగీత కళాకారులు ఇందులో పాల్గొంటున్నట్లు తెలిపారు. ప్రముఖ సంగీత ఆచార్యులు డాక్టర్ మండ సర్వేశ్వర్ రావు, డాక్టర్ శ్రీ స్వప్న రాణి, శ్రీ రాకేష్ వైద్య ముఖ్య అతిథులుగా హాజరవుతున్నట్లు తెలిపారు. న్యాయమూర్తి శేషతల్ప సాయి, కందకుర్తి యాదవరావు, డాక్టర్ కాసర్ల నరేష్ రావు పాల్గొంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమానికి సంగీత, సాహిత్య అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు. ఈ సమావేశంలో కార్యక్రమ నిర్వాహకులు ప్రతాప శ్రీనివాస్, ప్రతాప గౌరి శంకర శాస్త్రి, ప్రతాప సత్యసాయిబాబా, సంగీత చార్యులు డాక్టర్ స్వప్నరాణి, డాక్టర్ నరేష్‌రావు, భాస్కర్ రాజు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కిట్స్ స్వాగత వేడుకలు



నృత్యాలు చేస్తున్న విద్యార్థినిలు

నిజామాబాద్‌అర్బన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): నగరశివారులోని కాకతీయ మహిళా ఇంజనీరింగ్ కళాశాల (కిట్స్) మొదటి సంవత్సరం విద్యార్థులకు శనివారం స్వాగత వేడుకలు ఘనంగా నిర్వహించారు. నగరంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన స్వాగత వేడుకలకు కళాశాల చైర్మన్ విజయలక్ష్మిహాజరై దేశఅభివృద్ధిలో టెక్నాలజీ ప్రాముఖ్యతను మరియు ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్సీ గురించి వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థినిలు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల డైరెక్టర్ రజినీకాంత్ పాల్గొని మాట్లాడారు. కళాశాలలో ల్యాబ్‌లను, అధ్యాపకులను చక్కగా వినియోగించుకొని కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మైనార్టీ పాఠశాలలో ఆరోగ్య శిబిరం

డిచ్‌పల్లి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): డిచ్‌పల్లి మండలంలోని ధర్మారం(బి) లోగల మైనార్టీ ప్రభుత్వ బాలుర కళాశాలలో ఇందల్వాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచు కోవాలని ఆరోగ్య విస్తీర్ల అధికారి శంకర్ సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ రణవీర్‌రెడ్డి, ఆరోగ్య పర్యవేక్షకులు రాజేందర్, దేవపాల, ఆరోగ్య కార్యకర్తలు సావిత్రి, మహాలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అంబేద్కర్ యూనివర్సిటీ డిగ్రీ, పీజీ అడ్మిషన్ల గడువు పొడగింపు

నిజామాబాద్‌అర్బన్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి):డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ డిగ్రీ, పీజీ అడ్మిషన్ల గడువును ఈనెల 30 వరకు పొడగించినట్లు అధ్యయన కేంద్ర కోఆర్డినేటర్ రంజిత ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారారిజిస్ట్రేషన్ చేసుకొని ఒరిజినల్, జిరాక్స్ సర్టిఫికెట్లతో గిరిరాజ్ కళాశాలలోని అధ్యయన కేం ద్రాన్ని సంప్రదించాలని ఆమె తెలిపారు. డిగ్రీ మొదటి సంవత్సరం సెమిస్టర్-2 పరీక్షలు అక్టోబరు 28నుంచి ప్రారంభం కానున్నాయని విద్యార్థులు హాల్‌టికెట్లను ఆన్‌లైన్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకొని హాల్‌టికెట్‌తో పాటు ఏదైనా ఐడి ప్రూఫ్‌ను తప్పనిసరిగా వెంట తీసుకురావాలని ఆమె తెలిపారు. ఇతరవివరాలకు 7382929612 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

ప్రమాదానికి కారణమవుతున్న స్పీడ్ బ్రేకర్ల తొలగింపు



స్పీడ్ బ్రేకర్లను తొలగిస్తున్న స్థానికులు

నవీపేట,అక్టోబరు26(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మోడల్ పాఠశాల మూల మలుపు వద్ద ప్రమాదకరంగా ఉన్న స్పీడ్ బ్రేకర్లను శనివారం పలువురు స్థానికులు తొలగించారు. జానకంపేట, నవీపేటల మధ్యన ఉన్న నాలుగు లైన్‌ల రహదారిపై నిబంధనలకు విరుద్ధంగా గతంలో స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేశారు. స్పీడ్ బ్రేకర్ల వద్ద బ్లాక్ అండ్ వైట్‌చారాల గుర్తులు గాని రేడియంతో గుర్తులు గాని ఏర్పాటు చేయకపోవడంతో తరుచుగా ఈ ప్రాంతంలో ప్రమాదాలు జరుగుతున్నాయి. వాహనదారులు ప్రమాదాల బారిన పడి పదుల సంఖ్యలో గాయాలపాలైన సందర్భాలు ఉన్నాయి.గతగురువారం సాయంత్రం సైతం జానకంపేట నుంచి నవీపేట వైపు వేగంగా వెళ్తున్నకారు మోడల్ పాఠశాల మూలమలుపు వద్ద ఉన్న స్పీడ్ బ్రేకర్లను గమనించకుండా ముందుకు నడపగా అతిసమీపంలో స్పీడ్ బ్రేకర్లు ఉన్న విషయాన్ని డ్రైవర్ గమనించి కారు సడన్ బ్రేక్ వేయడంతో వెనుకనే వస్తున్న బైక్ కారును ఢీకొని మండలంలోని ఫకీరాబాద్‌కు చెందిన ఒడ్డె గంగాధర్ అనే వ్యక్తితీవ్రగాయాలపాలైన విషయం విదితమే.శనివారం'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో ప్రమాదాలకు నిలయాలుగాస్పీడ్ బ్రేకర్లు అనేవార్తకు అధికారుల కంటే ముందుగానే స్థానికులు స్పందించి సంబంధిత స్పీడ్ బ్రేకర్లను తొలగించారు. భవిష్యత్‌లో సమీప ప్రాంతాలలో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేస్తే నల్లపు, తెలుపురంగు చారాలను ఏర్పాటుచేయడంతో పాటు రాత్రి సమయాల్లో ప్రమాదాలు కాకుండా రేడియం గుర్తులను అందుబాటులో ఉంచాలని స్థానికులు కోరుతున్నారు.

నుడా విస్తరణ!

(5వ పేజీ తరువాయి)

తీసుకోనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఈ నుడాకు నిధులను విడుదల చేయనుంది. నుడా పరిధి పెరగడంతో కార్యాలయం కూడా విస్తరించనున్నారు. సిబ్బందిని కూడా పెంచనున్నారు. నుడా పరిధిలోకి 468 గ్రామాలు రావడంతో కావాల్సిన సిబ్బందిని భర్తీ చేయనున్నారు. నుడా పరిధిలో అడ్మినిస్ట్రేషన్, అకౌంట్స్, డెవలప్‌మెంట్ వింగ్, ప్రణాళిక విభాగం, హార్టికల్చర్ విభాగంతో పాటు ఇతర విభాగాలను ఏర్పాటు చేయనున్నారు. వీటి ఆధ్వర్యంలోనే నుడా పరిధిలో కార్యక్రమాలను చేపట్టనున్నారు. ప్రస్తుతం నుడాకు కొత్త చైర్మన్‌ను నియమించారు. ఇంకా పాలకవర్గం సభ్యులను నియమించలేదు. ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం వల్ల మిగతా నియామకాలను కూడా త్వరలో చేపట్టనున్నట్లు తెలుస్తుంది. జిల్లా వ్యాప్తంగా నుడా విస్తరించడం వల్ల అభివృద్ధికి అవకాశం ఎక్కువగా ఉంటుందని అధికారులు తెలిపారు.

శాంతియుతంగా పండుగలను జరుపుకోవాలి

● నిజామాబాద్ ఏసీపీ రాజావెంకటరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న నిజామాబాద్ ఏసీపీ

ఖిల్లా, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి):పండుగలను శాంతియుత వాతవరణంలో జరుపుకోవాలని నిజామాబాద్ ఏసీపి ఎల్.రాజ వెంకటరెడ్డి అన్నారు. నగరంలోని దుబ్బా ప్రాంతంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో శనివారం రాత్రి పటాకుల దుకాణాల యజమానులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పటాకులను అమ్మే సమయంలో పలు జాగ్రత్తలు పాటించాలని సూచించారు.పోలీసుశాఖ ద్వారా అన్ని అనుమతులు తీసుకోవాలని తెలిపారు. అమ్మేవారు విడిగా లైసెన్సులు తీసుకోవాలన్నారు. లైసెన్సులు లేకుండా అమ్మినట్లయితే వారి పై శాఖ పరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నగర ఇన్స్‌పెక్టర్, నార్త్, సౌత్, ధర్పల్లి, రూరల్, డిచ్‌పల్లి ఇన్స్‌పెక్టర్లు, మూడో టౌన్ ఎస్‌ఐ మహేష్, సిబ్బంది పాల్గొన్నారు.

28 నుంచి మార్కెట్‌యార్డ్‌కు దీపావళి సెలవులు

ఖిల్లా,అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి):దీపావళి పండుగను పురస్కరించుకుని ఈనెల 28 సోమవారం నుంచి 4వ తేది నవంబర్ వరకు వ్యవసాయ మార్కెట్ యార్డ్‌కు సెలవులు ప్రకటించినట్లు వ్యవసాయ మార్కెట్ కమిటీ సెలక్షన్‌గ్రేడ్ కార్యదర్శి అపర్ణ ఒక ప్రకటనలో తెలిపారు.ఆయా తేదీలో యార్డులో ఎటువంటి వ్యాపార లావాదేవీలు నిర్వహించడం జరుగదని తెలిపారు. రైతులు తాము పండించిన ఉత్పత్తులను ఆయా తేదీలో మార్కెట్‌కు తరలించరాదని సూచించారు.తిరిగి 4వ తేది నవంబరు సోమవారం నుంచి యధావిధిగా వ్యాపారలావదేవీలు నిర్వహించడం జరుగుతుందన్నారు.ఈవిషయాన్ని గమనించి రైతులు మార్కెట్ కమిటీకి సహకరించాలని కోరారు.

నాటుకోళ్ల పెంపుతో ఉపాధి అవకాశాలు



ధర్మారంలో నాటుకోళ్ల పెంపకం యూనిట్‌ను ప్రారంభిస్తున్న డీఆర్డీవో

డిచ్‌పల్లి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం మహిళా సంఘాలకు నాటుకోళ్ల పెంపకాన్ని ప్రోత్సహిస్తోందని ప్రభుత్వం కూడా ఈ విషయంలో మహిళా సంఘాలకు కావాల్సిన చేయూతను అందిస్తుందని డీఆర్డీవో పీడీ సాయాగౌడ్ పేర్కొన్నారు. శనివారం ధర్మారం(బి) గ్రామంలో నాటుకోళ్ల యూనిట్‌ను ప్రారంభించిన అనంతరం పెంపకానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.ఈకార్యక్రమంలో ఏపీడీ రవీందర్, ఏపీఎం రజిత, సీసీ నాగరాజు,వీవో అధ్యక్షురాలు ఉషా,తదితరులు పాల్గొన్నారు.

ఒంటరి వృద్ధురాలి మెడలో నుంచి బంగారు గొలుసు అపహరణ

ఖిల్లా, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి):ఇంట్లో ఒంటరిగా ఉన్న వృద్ధురాలి మెడలో నుంచి సుమారు రెండు తులాల బంగారు గొలుసును అపహరించిన ఘటన నగరంలోని నాలుగో టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో గల వినాయక్‌నగర్‌లో శనివారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. నర్సుబాయి అనే 60ఏళ్ల వృద్ధురాలి భర్త బాదయ్య పని నిమిత్తం బయటకు వెళ్లాడు. సుమారు మూడు గంటల సమయంలో ఇద్దరు గుర్తు తెలియని దుండగులు ద్విచక్రవాహనంపై వచ్చి తమకు నిమ్మకాయలు కావాలని వృద్ధురాలిని కోరారు. అదే సాకుతో ఇంట్లోకి చొరబడి ఎవరు లేనిది గమనించి ఆమె మెడలో ఉన్న బంగారు గొలుసు అపహరించుకుని వెళ్లారు. బాధితులు కేకలు వేసినప్పటికి దుండగులు పారిపోయారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకుని విచారణ చేస్తున్నట్లు ఎస్‌ఐ శ్రీకాంత్ తెలిపారు. దుండగుల కోసం ఆ ప్రాంతంలోని సీసీ పుటేజీలను పరిశీస్తున్నారు.

చికెన్ ధరలు




రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	రూ. 100	రూ.230	రూ. 250
వెన్‌కాబ్(కిలో)	రూ.110	రూ.235	రూ. 255

బంగారం ధరలు



బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.81900	రూ.75500	రూ.1040

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్.. వేణుమాల్

స్క్రీన్-1 : వేనం (తెలుగు 3డి) (11.25, 2.00)
: వేనం (ఇంగ్లీష్ 3డి) (4.35, 7.10, 9.45)
స్క్రీన్-2 : నరుడి బతుకు నటన (1.05)
: దేవర (4.00)
: జనక అయితే గనక (7.35)
: విశ్వం (10.35)
స్క్రీన్-3 : జనక అయితే గనక (1.20)
: పొట్టేల్ (4.20, 10.25)
: నరుడి బతుకు నటన (7.30)
స్క్రీన్-4 : ఎంత పని చేశావు చంటీ (11.00)
: లగ్గం (1.55, 7.50)
: సముద్రుడు (4.45)
: వెట్టయన్ (10.40)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : లగ్గం (10.40, 4.40)
: విశ్వం (1.30, 7.30)
: వెట్టయన్ (10.40)
స్క్రీన్-2 : వేనం (తెలుగు 3డి) (11.00, 1.45, 4.40, 7.35, 10.30)
స్క్రీన్-3 : వెట్టయన్ (1.35)
: పొట్టేల్ 4.40, 10.40)
: దేవర (7.35)



దేవి : పొట్టేల్ (11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్ : విశ్వం (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్ : వేనం (11.15, 2.15, 6.15, 9.15)
లలితామహాల్ : దేవర (11.15, 2.15, 6.15, 9.15)

- నిజామాబాద్ అర్బన్